ప్రభాత
# కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
గురువారం 20 నవంబర్ 2025




## రైల్వే అండర్ బ్రిడ్జి సమస్య పరిష్కరించాలి

**బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ నాయుడు**

రాజంపేట, నవంబర్19 ప్రభాతవార్త



రాజంపేటలో అర్ధంతరంగా నిలిచిపోయిన రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి సమస్యను పరిష్కరించాలని రైల్వే సహాయ మంత్రి వి. సోమన్నని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు కలిసి కోరారు. ప్రస్తుతము అక్కడ 80 శాతం పనులు పూర్తి అయ్యి, స్థానిక ప్రభుత్వ అధికారుల చొరవలేని కారణంగా మిగిలిన పనులు పూర్తి కాకపోవడంతో, ప్రజలు, విద్యార్థులు పడుతున్న కష్టాలను చిత్రాలు చూపిస్తూ వివరించారు. దీనిని గతి శక్తి పథకం క్రింద మిగిలిన భాగం పనికూడా రైల్వే పూర్తి చెయ్యాలని కోరగా స్పందించిన మంత్రి త్వరగా పూర్తి చెపించే బాధ్యత రైల్వే తీసుకొంటుందని, అధికారులను ఆదేశించడం జరుగుతుందన్నారు.ఈ సందర్భంగా నాగోతు రమేష్ నాయుడు మాట్లాడుతూ స్థానిక రెవిన్యూ అధికారులు చొరవ తీసుకొని , ఆర్ యు బి రాకతో కోల్పోతున్న భూమి యజమానులు, అక్కడ వున్న వ్యాపారస్తులకు, నష్టపరిహారం క్రింద ప్రత్యామ్నాయంగా వేరే చోట భూమిని ఇవ్వాలని కోరారు.

## రైతు సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

**మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి**



గాలివీడు, నవంబర్ 19(ప్రభాతవార్త):

రాష్ట్ర రైతాంగం మరియు వారి సంక్షేమం కోసం వారి అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు దక్కుతుందని అందువల్ల ఆయన నేడు రాష్ట్ర ప్రజల హృదయాలలో రైతు బాంధవుడుగా మారాడని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కొనియాడారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం రైతాంగాన్ని నిర్లక్ష్యం చేయడంతో వారు తీవ్ర అన్యాయానికి గురయ్యారని పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఏనాడూ రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని దుయ్యబట్టారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల అన్నింటినీ నెరవేరుస్తున్నదని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి రైతుకు ఏడాదికి అన్నదాత సుఖీభవ పథకం, పీఎం కిసాన్ పథకం ద్వారా రూ.20 వేలు రైతుల అకౌంట్లలో జమ చేయడం జరుగుతున్నదని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 46 లక్షల మంది అర్హులైన రైతులందరికీ మొదటి విడతలో 3134 కోట్లు, ఆగస్టు నెలలో రైతుల ఖాతాలలో జమచేయడం జరిగిందని, ప్రస్తుతం రెండవ విడతలో 3175 కోట్లు ఈ రోజు నుంచి రైతుల ఖాతాలో జమ అవుతాయని పేర్కొన్నారు. గాలివీడు మండలంలో 8 వేల మంది రైతులకు రూ.5 కోట్లు జమ అవుతాయని తెలిపారు. చంద్రబాబు హయాంలోని రైతులకు అవసరమైన డ్రిప్పు, స్ప్రింక్లర్లు పైపులు, 90 శాతం సబ్సిడీతో రైతులకు అందించడం జరుగుతున్నదని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును గాలికి వదిలేసిందని ప్రస్తుత కూటమి ప్రభుత్వం పోలవరాన్ని పూర్తి చేయడంతో పాటు నదుల అనుసంధాన్ని చేపట్టి రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను నీటితో నింపడానికి కృత నిశ్చయంతో పనిచేస్తున్నదని అన్నారు. కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న వివిధ రకాల విధానాలను, అభివృద్ధి సంక్షేమ పథకాలను వైసీపీ నాయకులు అభినందించాల్సింది పోయి ప్రభుత్వంపై బురదచల్లడం అదే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. రూ.350 కోట్లతో వెలిగల్లు ప్రాజెక్టు నుంచి తాగునీరుః మండల కేంద్రానికి సమీపంలోని వెలిగల్లు ప్రాజెక్టు నుంచి జలజీవన్ పథకం ద్వారా నియోజకవర్గంలోని ఆరు మండలాలకు రూ.350 కోట్లతో ప్రతి పల్లెకు మంచినీటి సౌకర్యం కల్పించడం జరుగుతున్నదని ప్రస్తుతం ఆ పథకానికి సంబంధించి పనులు కూడా ప్రారంభమయ్యాయని మంత్రి తెలిపారు. రాబోయే 8 నెలల కాలంలో ఈ పనులన్నింటినీ పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే వంద కోట్లతో వెలిగల్లు ప్రాజెక్టు నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న చెరువులకు ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీటి సౌకర్యం కల్పించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. రాబోయే కాలంలో ప్రజలకు అవసరమయ్యే అన్ని రకాల సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రకెడ్డి, ఎంపీడీఓ చంద్రమౌళి, తహసీల్దార్ భాగ్యలత, పలువురు టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# రైతు మీసం మెలేసే రోజులు రాబోతున్నాయి..

- అన్నదాత అభివృద్ధికి పంచసూత్రాలు..
- నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్దతు అంశాలపై ఫోకస్..
- మొంథా తుఫాన్ బాధిత రైతులకు త్వరలో రూ.390 కోట్లు ఇస్తాం..
- రెండో విడత అన్నదాత సుఖీభవపీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమంలో సీఎం చంద్రబాబు..
- రెండో విడతలో రూ. 3135 కోట్ల మేర చెల్లింపులు..
- 46,85,838 మంది రైతులకు రూ.3,135 కోట్ల మేర లబ్ధి..



పెండ్లిమర్రి/ కమలాపురం/ నవంబర్ 19 ప్రభాతవార్త

వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు అన్నదాతకు అండగా నిలిచేందుకు పంచసూత్ర ప్రణాళికతో వెళ్తున్నామని సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. తెలుగు ఐటీ నిపుణులకు ఎంత మంచి పేరు ఉందో ఏపీ రైతులు కూడా ప్రపంచ వ్యాప్తంగా అదే స్థాయిలో గుర్తింపు రావాలని సీఎం చంద్రబాబు తెలిపారు. కమలాపురం నియోజకవర్గం పెండ్లిమర్రిలో అన్నదాత సుఖీభవపీఎం కిసాన్ రెండో విడత నిధులను సిఎం విడుదల చేశారు. రెండో విడత చెల్లింపుల్లో భాగంగా రూ.7 వేల చొప్పున 46,85,838 మంది రైతుల ఖాతాలకు రూ. 3,135 కోట్లను జమ చేయడం జరిగింది. రచ్చబండలో పాల్గొని రైతులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ప్రజావేదిక నుంచి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు సాగు విధానాలు అవలంభించాలని, సాగులో టెక్నాలజీ వినియోగంపై దృష్టి పెడితే పెట్టుబడి వ్యయం తగ్గుతుందన్నారు. మనది రైతు ప్రభుత్వమని, అన్నదాత సుఖీభవపీఎం కిసాన్ పథకంలో భాగంగా తొలి విడతలో రూ.3,175 వేల కోట్ల సొమ్మును ఈ ఏడాది ఆగస్టులో జమ చేశామన్నారు. రెండు విడతలు కలిపి మొత్తం రూ.6,310 కోట్లు అన్నదాతకు అందించామన్నారు. గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. ఆర్థిక ఇబ్బందులున్నా ఇచ్చిన మాట ప్రకారం నిధులు జమ చేయడం రైతు సంక్షేమంపై ప్రజా ప్రభుత్వ చిత్తశుద్ధి నిరూపించుకుందన్నారు.

### పంచ సూత్రాల అమలుతో రైతే రాజు..

నీరు సమృద్ధిగా ఉన్నచోటే అభివృద్ధి జరిగింది. రాయలసీమ వాసుల కష్టాలు నేను కళ్లారా చూశానని కరువు రహిత రాష్ట్రంగా ఏపీని తయారు చేసి ప్రతి ఎకరాకు నీరివ్వాలన్నదే తన సంకల్పమన్నారు. భూగర్భ జలాలు పెంచాలి. ఒకప్పుడు సీమలో 100 అడుగుల కింద నీరు ఉండేది. ఇప్పుడు 7.3 మీటర్లకే నీరు వస్తోందంటే మన దూరదృష్టి వల్లే సాధ్యమైందన్నారు. సముద్రంలోకి వృథాగా పోయే వరద నీటిని రాయలసీమ వైపు మళ్లించి రిజర్వాయర్లు నింపాం. హంద్రీనీవా ద్వారా సీమకు నీరిచ్చాం. రాష్ట్రంలో 95 శాతం జలాశయాలు నిండాయి. చెప్పిన విధంగా నదుల అనుసంధానం చేసి చూపిస్తామన్నారు. అటు కేంద్రం, ఇటు రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్లు ఉండబట్టే రైతులకు మేలు జరుగుతోందన్నారు.

ప్రపంచవ్యాప్తంగా ఆహారపు అలవాట్లలో మార్పులు వస్తున్నాయని. ఆర్గానిక్ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగిందన్నారు. ఇందుకు అనుగుణంగా మన సాగు పద్ధతులు మారాలని, ప్రకృతి సేద్యం వైపు రైతులు మళ్లాలన్నారు. డిమాండ్ ఉన్న పంటలను పండించాలన్నారు. ప్రస్తుతం రసాయనిక రహిత పంటలకే విదేశాల్లో కూడా డిమాండ్ ఉంది. టెస్టింగ్, ట్రేసబులిటీ వంటి అంశాలనేవి ఇప్పుడు దేశ, విదేశాల్లో కీలకంగా మారాయన్నారు. అందుకే రైతులు క్రిమిసంహారక మందులు, ఎరువుల వాడకం తగ్గించాలని చంద్రబాబు పేర్కొన్నారు.

సాగులో సరికొత్త విధానాలను ఎప్పటికప్పుడు రైతులకు పరిచయం చేస్తామని. ఏ పంటకు డిమాండ్ ఉందో ముందే వివరిస్తామన్నారు. అన్నదాతలు వ్యవసాయంలో పాత విధానాల్ని వదిలి కొత్త మార్గాల్ని అన్వేషించి మారుతున్న టెక్నాలజీ వినియోగంతో సాగు వ్యయం తగ్గుతుందన్నారు. భూసార పరీక్షలు. గాలుల గమనాలు. పంటలకున్న డిమాండ్. వాతావరణంలో వస్తున్న మార్పులను, క్రిమీ సంహరక వాడకం, సాగులో డ్రోన్లు, శాటిలైట్ల వినియోగం ద్వారా రైతుల ఆదాయం పెరిగేలా చూస్తున్నామన్నారు. రాయలసీమలో డ్రోన్, స్పేస్ సిటీలను ఏర్పాటు చేస్తున్నామని. స్పేస్ సిటీ ద్వారా శాటిలైట్లను అద్దెకు తీసుకుని, వీటి ద్వారా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. "ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు తక్షణం స్పందిస్తున్నామని. మార్కెట్ ఇంటర్వేన్షన్ ద్వారా రైతులను ఆదుకుంటామన్నారు. పంటలకు మద్దతు ధర లేకున్నా విపత్తులు సంభవించినా వెంటనే స్పందిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం వచ్చాక విపత్తులకు నష్టపరిహం నిమిత్తం రూ. 310 కోట్లు చెల్లింపులు జరిపామన్నారు.

### సంక్షేమం అందిస్తాం... అభివృద్ధి చేస్తాం

2024 సార్వత్రిక ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టే తల్లికి వందనం, స్త్రీ శక్తిఉచిత బస్సు, దీపం -2, ఎన్టీఆర్ భరోసా పించన్లు, మెగా డీఎస్సీ వంటి సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశాం. విధ్వంస, ఆటవిక పాలన ఎలా ఉంటుందో గత పాలనలో చూశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే ప్రజలకు స్వేచ్ఛ వచ్చిందన్నారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన హామీకి కట్టుబడి ఉన్నామన్నారు. విశాఖ భాగస్వామ్య సదస్సులో 613 ఎంఓయూలు చేసుకున్నామని వీటి ద్వారా రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు, 16 లక్షల ఉద్యోగాలు వస్తాయన్నారు. రాయలసీమను పారిశ్రామిక హబ్‌గా తయారు చేసి కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర పునర్నిర్మాణ దిశగా అడుగులు వేస్తున్నామని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే చైతన్య రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





## రైతుల జీవితాల్లో వెలుగులు నింపేందుకే అన్నదాత సుఖీభవ

**టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు**

రాజంపేట, నవంబర్ 19 ప్రభాతవార్త



పుడమి తల్లి తల్లి నే నమ్ముకుని సాంప్రదాయ వ్యవసాయాన్ని విడచకుండా ఎన్ని కష్టాలు ఎదురైనా జీవనాన్ని సాగిస్తున్న రైతుల జీవితాల్లో వెలుగులు నింపేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టాయని టిడిపి అసెంబ్లీ ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్రాజు అన్నారు. అన్నం పెట్టే రైతన్నకు ఎంత చేసినా తక్కువేనని అన్నారు. బుధవారం స్థానిక ఎన్ కె ఎన్ కళ్యాణ మండపంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రాజంపేట నియోజకవర్గం లోని రైతులకు 14.37 కోట్ల చెక్కును ఆయన ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూబొప్పాయితోపాటు అరటి కి కూడా మద్దతు ధర వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.ప్రతి రైతన్నకు ఏడాదికి 20,000 ఆర్థిక సహాయం ,రైతన్న సేవలోనే ప్రభుత్వాలు ఉన్నాయన్నారురైతే రాజు అనేది సామెత కాదు నిజం చేయాల్సిన బాధ్యత అందరికీ ఉందన్నారు. రైతు కష్టంలోనూ నష్టంలోనూ ప్రభుత్వం తోడుంటుందన్నారు.రైతు బాగుంటే గ్రామాలు బాగుంటాయన్నారు.గ్రామాలు బాగుంటే దేశం బాగుంటుందన్నారు. దేశంలోని అన్ని కుటుంబాలు బాగుండాలి అంటే రైతులను సంతోషంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట సబ్ కలెక్టర్ భావన, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, ఉద్యానవన శాఖ అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు

## రూ.వెయ్యికోట్లతో రాష్ట్రంలో రోడ్లు అభివృద్ధి

**రాష్ట్ర మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

మదనపల్లె, నవంబర్ 19 ప్రభాతవార్త :

రాష్ట్రంలో వెయ్యికోట్లతో అన్ని నియోజకవర్గాల్లోనూ రోడ్లు అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి తెలిపారు. బుధవారం మదనపల్లె ఆర్‌అండ్‌బి అతిధిభవన్‌లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషాతో కలసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో గుంతల లేని రహదారుల నిర్మాణమే లక్ష్యం అన్నారు. రాష్ట్రానికి గూగుల్ రాకతో అనేక పరిశ్రమలు వస్తున్నాయన్నారు. రూ.13లక్షల కోట్లతో రాష్ట్రంలో పారిశ్రామిక వేత్తలు పరిశ్రమలు పెట్టుందుకు సిద్దంగా ఉన్నారన్నారు. ఇటీవల పడ్డ వర్షాలతో రాష్ట్రంలో రహదారులు అక్కడక్కడా గుంతలుగా ఉన్నాయని వెంటనే మరమ్మత్తులు చేపట్టడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలనలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఐటి, విద్యాశాఖామంత్రి నారా లోకేష్ కృషి కారణంగా రాష్ట్రానికి పరిశ్రమలు వెల్లువులా వస్తున్నాయన్నారు. పారిశ్రామికవేత్తలు ముఖ్యమంత్రిపై ఉన్న నమ్మకంతోనే పెట్టుబడులు పెడుతున్నారన్నారు. డిప్యూటి పవన్‌కళ్యాణ్‌తో కలసి రాష్ట్రాని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.వైకాపా పాలనలో రాష్ట్రం అన్ని విధాల తీవ్రంగా నష్టపోయిందన్నారు. పారిశ్రామిక వేత్తలు కూడా అప్పట్లో రాష్ట్రానికి వచ్చేందుకు భయపడేవారన్నారు. ముఖ్యమంత్రి ఎంతో చిత్తశుద్దితో ప్రతి శాఖను అభివృద్ధి చేసేలా కమిటీలు చేసి చర్యలు తీసుకొంటున్నారన్నారు. రాష్ట్రంలో అనేక జాతీయ రహదారులను ఆరులైన్లు, నాలుగులైన్లుగా మార్చి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా విన్నపం మేరకు నియోజకవర్గంలో రోడ్లు అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. సిటిఎం రోడ్డు, రామసముద్రం, నిమ్మనపల్లె మండలాలకు డబుల్‌రోడ్లు నిర్మాణానికి చర్యలు తీసుకొంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పోరేషన్ పచ్చిపాల రామక్రిష్ణాచారి, హజ్‌కమిటీ సభ్యులు పఠాన్‌ఖాదర్‌ఖాన్, బిల్డింగ్ సొసైటి అధ్యక్షులు షంషీర్, రాష్ట్ర మైనార్టీ నాయకులుఎస్.మస్తాన్, ఆర్‌జె.వెంకటేష్, రాటకొండ మధుబాబు, నాదేళ్ళ శివలు పాల్గొన్నారు.

# బద్వేలులో రెచ్చిపోతున్న మట్టి మాఫియా

- : చెరువుల నుంచి యదేచ్ఛగా మట్టి తరలింపు
- : ట్రాక్టర్ సీజ్ చేసినా మారని వైనం
- : పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- : వారి సహకారంతోనే చెలరేగిపోతున్న మట్టి మాఫియా



బద్వేలు ,నవంబర్ 19, ప్రభాతవార్త:

చెరువుల నుండి ఒక ట్రాక్టర్ మట్టి కూడా బయటకు తరలించేందుకు వీలులేదని, చెబుతున్నప్పటికీ మట్టి మాపియా బద్వేలులో రెచ్చిపోతుంది. చెరువులలో పెద్ద పెద్ద గుంతలు తవ్వి మట్టిని వెంచర్లకు తరలిస్తున్నా ఇరిగేషన్ అధికారులు చూస్తున్నారు తప్ప చర్యలు చేపట్టడం లేదు. చెరువు నుంచి వెంచర్లకు మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని గతంలో ఆర్డీవో వెంకటరమణ హుకుం జారీ చేసినా వారి బదిలీ అనంతరం ఇష్టానుసారంగా బద్వేలులో కొండలు, చెరువులను సైతం వదలకుండా మట్టిని వెంచర్లకు తరలిస్తే సొమ్ము చేసుకుంటున్నా ఇరిగేషన్ అదికారులు మౌనంగా ఉన్నారు.మండలంలోని కొంగళవీడు వద్ద వేసిన వెంచర్‌కు వందల టిప్పర్ల మట్టిని చెరువునుంచి తీశారు. అలాగే పోరుమామిళ్ల బైపాస్ రోడ్డులోని ఒక వెంచర్‌కు వందల ట్రాక్టర్లు మట్టిని చెరువు నుంచి తరలించిన వైనం అందరికీ తెలిసినా దీని వెనుక ఇరిగేషన్ అదికారి ఉన్నారని ప్రతి ఒక్కరికీ తెలుసు. వారి సహకారంతో మట్టిని తరలిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం బాకరాపేట చెరువులో రోజూ మట్టిని తరలించే కార్యక్రమం చేపట్టారు. రాత్రనక, పగలనగా చెరువులలో ఉన్న నీటికి మట్టితో అడ్డుకట్ట వేసి గట్టిగా ఉండే ప్రాంతాలలో మట్టిని యదేచ్ఛగా తరలించే కార్యక్రమం చేపట్టారు. పక్కనే ఉన్న ఒక వెంచర్‌లోకి ఈ మట్టిని తరలించినట్లు రెవెన్యూ అదికారులకు తెలియడంతో ఈ మద్య రెండు ట్రాక్టర్లను బద్వేలు రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. అయినప్పటికీ సమయానుకూలంగా మళ్లి మట్టి మాఫియా రెచ్చిపోతూ యదేచ్ఛగా తరలించడం ప్రారంభించారు. చెరువులో 20 అడుగులకు పైగా లోతు మట్టిని తడ్డంతో గుంతలు ఏర్పడి చెరువులు నిండినపుడు సరదాగా ఈతకు వెళ్లిన కొందరు మృతిచెందిన సంఘటనలు ఉన్నాయి. పొలాలకు అత్యవసరమైనపుడు అధికారుల అనుమతితో మట్టిని తరలించేందుకు ఒప్పందం ఉంది తప్ప ఇలా వెంచర్లకు చెరువులోనుంచి మట్టిని టన్నుల కొద్ది తరలించాలనే నిబంధన ఎక్కడా లేదు. ఇదంతా చూస్తుంటే గత కొద్ది సంవత్సరాలుగా బద్వేలులో పాతుకుపోయిన ఓ అధికారి సహకారంతో మట్టి మాఫియా రెచ్చిపోతు ఇష్టానుసారంగా మట్టిని అమ్ముకుంటున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. భాకరా పేట చెరువు వద్ద గతంలో ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్న సమయంలో ప్రజలు అడ్డుకున్నారు. మళ్లి ఇప్పుడు యదేచ్ఛగా మట్టి మాఫియా వెంచర్లకు తరలిస్తున్నా చూస్తుండడంపై అనేక అనుమానాలు వస్తున్నాయి. ఇప్పటికైనా మట్టి మాఫియా అరాచకాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

### మట్టి తరలించకుండా అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నం:

చెరువులు, తిప్పల నుంచి మట్టిని తరలించకూడదన్న నిబంధనలు ఉన్నప్పటికీ కొంతమంది మట్టిని తరలిస్తున్నట్లు వస్తున్న సమాచారంపై ఎప్పటికప్పుడు స్పందించి చర్యలు తీసుకుంటున్నాం. 2 ట్రాక్టర్లను కూడా ఈమద్య సీజ్ చేశామని ఈసారి కఠిన చర్యలు తీసుకుంటాం.

**- ఉదయభాస్కర్‌రాజు, తహశీల్దారు, బద్వేలు**

# అన్నదాత సుఖీభవ సభలో నాయకునికి అవమానం

**గుండెపోటుకు గురైన సీడ్ మల్లికార్జుననాయుడు.... పరామర్శించిన రాష్ట్ర మంత్రి మండిపల్లి, నాయకులు**

కురబలకోట, నవంబర్ 19 ప్రభాతవార్త :

తంబళ్ళపల్లె నియోజకవర్గంలోని కురబలకోట మండలం అంగళ్ళులోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాలులో జరిగిన అన్నదాత సుఖీభవ పథకం విడత నిధులు విడుదల కార్యక్రమానికి సంబంధించి టిడిపి నాయకులు సభా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖామంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి హాజరయ్యారు. సభ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి సమన్వయ కర్తగా ఉన్న సీడ్ మల్లికార్జుననాయుడును సభావేదిక పైకి రావాల్సిందిగా మంత్రి ఆహ్వానించారు. దీంతో మల్లికార్జుననాయుడు సభా స్టేజ్‌పైకి వెళ్ళి కూర్చొన్నారు. ఇది గిట్టని నియోజకవర్గంకు చెందిన టిడిపిలోని ఓ గ్రూప్ మండల నాయకులు, కార్యకర్తలు సీడ్ మల్లికార్జుననాయుడును స్టేజ్‌మీద నుంచి దించాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఆయనను స్టేజ్ నుంచి కిందకు దింపే వరకు సభ జరగనీవ్వమంటూ మంత్రిపై వాగ్వివిదానికి దిగారు. దీంతో మంత్రి దిక్కుతోచక స్టేజ్‌పై కూర్చొన్న సీడ్ మల్లికార్జుననాయుడును కిందకు వెళ్ళమని చెప్పడంతో ఆయన తీవ్ర అవమానంకు గురై అసహనం చెందారు. నియోజకవర్గం సీనియర్ నాయకునిగా ఉన్న తనకు సభా ప్రాంగణంలో జరిగిన అవమానం భరించలేక తీవ్ర అస్వస్థతకు గురికావడంతో వెంటనే స్థానికులు మదనపల్లెలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి గుండెపోటుకు గురైనట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకొన్న మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి,హుతాహుటిన మదనపల్లెకు చేరుకొని ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న సీడ్ మల్లికార్జుననాయుడును పరామర్శించారు. ఆయనతో పాటు రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, మదనపల్లె, తంబళ్ళపల్లె నియోజకవర్గంలోని పలు నాయకులు, కార్యకర్తలు ఆసుపత్రికి వెళ్ళి పరామర్శించారు. తంబళ్ళపల్లె నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలో నెలకొన్న గ్రూపు రాజకీయాలతో రాష్ట్ర అధిష్టాన నాయకులకు తలనొప్పిగా మారింది. ఇక్కడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ లేకపోవడంతోనే ఎవరికివారు తోచిన విధంగా వ్యవహరిస్తున్నారంటూ పలువురు చెబుతున్నారు. ఇకనైనా టిడిపి అధిష్టానం తంబళ్ళపల్లె నియోజకవర్గంపై దృష్టి సారించి వెంటనే నియోజకవర్గానికి ఇన్‌చార్జ్ నియమించి గ్రూప్ రాజకీయాలకు స్వస్థి పలకాలని పలువురు కోరుతున్నారు.



ఆసుపత్రిలో పరామర్శిస్తున్న మంత్రి మండిపల్లి

# రైతన్న సేవలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు





పులివెందుల నవంబర్ 19, ప్రభాత వార్త :
రైతన్న సేవలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాలన చేస్తున్నాయి అని అన్న దాత సుఖీభవ పీఎం కిసాన్ పథకాల ద్వారా రైతులకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా 41 980 మంది రైతులకు 28.31 కోట్ల రూపాయల నిధులను రైతుల ఖాతాలో జమ అయ్యాయని పులివెందుల నియోజకవర్గ ఇన్చార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. బుధవారం నాడు పులివెందుల పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ స్కిల్ ట్రైనింగ్ అకాడమీలో(ఇస్తా) లో అన్నదాత సుఖీభవ మరియు పిఎం కిసాన్ రెండో విడత పులివెందుల నియోజకవర్గ స్థాయి లాంచింగ్ కార్యక్రమం సహాయ వ్యవసాయ సంచాలకులు ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనమండలి స్థానిక పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి మా రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి మరియు స్థానిక పులివెందుల మండల జడ్పిటిసి సభ్యురాలు లతా రెడ్డి మరియు పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ అమర్నాథ్ యాదవ్ మరియు నియోజకవర్గ వ్యాప్తంగా ఆయా మండలాల మండల వ్యవసాయ అధికారులు రైతులు కార్యకర్తలు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజక వర్గ టిడిపి ఇన్చార్జి మారెడ్డి రవీంద్రారెడ్డి మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా ఏడు మండలాలకు సంబంధించి 41980 రైతులకు 28.31 కోట్ల రూపాయలు నిధులు అన్నదాత సుఖీభవ మరియు పీఎం కిసాన్ ద్వారా అర్హులైన రైతులందరికీ ఈ రోజు గౌరవ ప్రధానమంత్రి మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ద్వారా నేరుగా వారి ఖాతాలో జమ చేయడం జరుగుతుందని రైతులను ఆర్థికంగా ఆదుకోవడమే కాకుండా ప్రస్తుత రబీ సీజన్ సంబంధించి పెట్టుబడి నిధిగా వారికి ఆర్థిక ఉపశమనం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అని అదే విధముగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఏడాది 20000 రూపాయ లను మూడు దఫాలుగా రైతుల ఖాతాలో జమ చేయడం వారిని ఆర్థికంగా బలోపేతం చేయడం అదేవిధంగా వివిధ రకాల పథకాల ద్వారా అన్నదాతలకు మేలు చేసే కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి అహర్నిశలు కృషి చేస్తున్నారని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు నడిపించడంలో నాణ్యమైన ఆహార ఉత్పత్తులను పండించడంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటూ దేశంలోనే ఒక ఆదర్శమైన ముఖ్యమంత్రిగా ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు. లబ్ధిదారులకు ముఖ్య నాయకులు అధికారులు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు చెన్నారెడ్డి, శివశంకర్ రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి , రమేష్ , ఓబులేష్,రాజు,అభిలాష్ మరియు టెక్నికల్ వ్యవసాయ అధికారి సునీల్ కుమార్ రెడ్డి వ్యవసాయ శాఖ సిబ్బంది ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# సేంద్రీయ వ్యవసాయంతో రైతన్నలకు మేలు





బద్వేలు, నవంబర్ 19, ప్రభాతవార్త:
సేంద్రియ వ్యవసాయం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని బద్వేలు నియోజకవర్గం మాజీ శాసన సభ్యురాలు కె విజయమ్మ , నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ రితీష్ రెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం అన్నదాతలకు ప్రతిష్టాత్మకంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా రైతన్నలకు బాసటగా నిలిచే "కిసాన్ సమ్మాన్ నిధి అన్నదాత సుఖీభవ" రెండో విడత నిధులు విడుదల కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా రైతులతో సమావేశమై వారితో మాట్లాడారు. వారి సాధక బాధకాలను విన్నారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిఎం కిసాన్ నిధుల విడుదల సందర్భంగా ప్రధాని మోడీ ప్రసంగాన్ని రైతులతో కలిసి తిలకించారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగాన్ని రైతులతో కలిసి విన్నారు. తరువాత జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం పీఎం కిసాన్,అన్నదాత సుఖీభవ పథకం రెండవ విడతగా 46,85,838 రైతు కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో రూ.3135 కోట్ల రూపాయలు జమ చేసిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చంద్రబాబు నాయుడు సారథ్యంలో రూ.20 వేల రూపాయలు ఒక్కొక్క రైతు కుటుంబం ఖాతాలో ఏడాదికి జమ చేస్తున్నామన్నారు. ఇందులో రాష్ట్రం ప్రభుత్వం రూ.14వేల రూపాయలుగా తెలిపారు. సేద్యం పైనే ఎక్కువమంది రైతులు ఆధారపడి ఉన్నారని అన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు.అధిక దిగుబడుల కోసం రసాయన ఎరువులు పురుగుమందులు వాడటం వల్ల క్యాన్సర్, కిడ్నీ, దీర్ఘకాలిక వ్యాధుల ముప్పు పెరిగిపోతుందన్నారు. రోగ నిరోధకశక్తితగ్గిపోతుందన్నారు. యూరియా అధికంగా వాడటం కూడా క్యాన్సర్ ముప్పుకు కారణం అవుతుందని ఆధునిక పరిశోధనలుతెలియజేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా మనం అందరం మేల్కోవాల్సిన అవసరం ఉందన్నారు. సేంద్రీయ పద్ధతుల్లో సాగు చేయడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారాన్ని పండించవచ్చన్నారు. అన్నదాతలు సాగులో అధునాతన పద్ధతులను అనుసరించాలన్నారు. వరి,అరటి మాత్రమే కాకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోషన్న, బిజెపి పార్లమెంటు కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు, ఏఐసీసీ డైరెక్టర్ ప్రసాద్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ సుప్రజ, రంతు, కొర్రపాటి సురేంద్ర, పరిటాల వెంకటసుబ్బయ్య, తుడిమెళ్ళ వెంకటసుబ్బయ్య, కూటమినాయకులు, వ్యవసాయ శాఖ సచివాలయ సిబ్బంది, కూటమి పార్టీ కార్యకర్తలు మరియు రైతు సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పనుల గుర్తింపు పూర్తి చేయాలి



దువ్వూరు, నవంబరు 19, ప్రభాతవార్త:
ఉపాధి హామీ పథకంలో 2025-26కు సంబంధించిన పనుల గుర్తింపును పూర్తి చేయాలని ఎంపీడీవో సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సభాభవన్‌లో ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26 లో గ్రామాల్లోకి వెళ్లి ప్రజా ప్రతినిధులను కలిసి తన పంచాయతీ పరిధిలో ఏ ఏ పనులు చేయాలి, పనులకు ప్రయోజనం ఎంత మేరకు లబ్ధి చేకూరుతాయో తెలుసుకొని అటువంటి పనులను గుర్తించాలన్నారు. పనుల గుర్తింపును ఖచ్చితంగా పూర్తి చేసి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అలాగే శ్రామికులకు ఈ కేవైసీ పూర్తి చేయించాలని తెలిపారు. అలాగే పండ్ల తోటల పెంపకం, కంపోస్టు గుంతలు తదితర వాటిని గుర్తించి లబ్ధిదారులతో పనులు చేయించాలని తెలిపారు. పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ఎక్కువ ప్రోత్సాహం ఇస్తుందని వాటిని చేకూరే విధంగా రైతులను చైతన్యవంతులు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ లక్ష్మీనారాయణ, ఈసి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి,

మైదుకూరు, నవంబర్ 19, ప్రభాతవార్త:
కడప జిల్లా మైదుకూరు మండలం లోని ఆక్కులాయపల్లె గ్రామానికి చెందిన వెంకటరామయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు సమాచారం. మృతికి గల కారణం మైదుకూరు బాల శివ యోగి డిగ్రీ కళాశాల బస్సు వనిపెంట నుండి లెక్కల వారి పల్లి రోడ్డులో హోటల్ దగ్గర ప్రమాదవశాత్తు వెంకటరామయ్యకు ప్రమాదం జరిగినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

## విస్తృతంగా కుష్టు వ్యాధి గుర్తింపు కార్యక్రమం.

చిట్వేలి,నవంబర్ 19, ప్రభాతవార్త:
కుష్టు వ్యాధిని గుర్తించే క్రమంలో మండల వ్యాప్తంగా విస్తృత క్యాంపులను నిర్వహిస్తున్నట్లు పీహెచ్సీ వైద్యులు డాక్టర్ అన్సారి అన్నారు. బుధవారం తిమ్మయ్య గారి పల్లి హెచ్ డబ్ల్యు నందు హెల్త్ సూపర్వైజర్ ఇస్మాయిల్ భాష ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగిందన్నారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి స్పర్శ లేని మచ్చలు ఏ ఇతర ఇబ్బందులు ఉన్నా తమకు తెలిపితే వైద్యులు దగ్గర పరీక్షలు చేయించి ఉచితంగా మందులు ఇస్తామని తెలిపారన్నారు. ప్రతికూల వాతావరణం కొనసాగుతున్నందువల్ల సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలే అవకాశం ఉందని, దోమలు ఇంటి ఆవరణలో వృద్ధి చెందకుండా నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలని, పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించడం జరిగిందన్నారు. ఏ ఇబ్బంది ఉన్న తమ గ్రామంలోని ఆశ సిబ్బందిని సంప్రదించాలని ప్రజలకు సూచించామన్నారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణీలకు ప్రత్యేక ఆరోగ్య సంరక్షణ చర్యలను తీసుకోవాలని వైద్యులు అన్సారి అన్నారు.కార్యక్రమంలో ఆశా వర్కర్ చెంగమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.



సర్వే కార్యక్రమంలో పాల్గొన్న ఆరోగ్య సిబ్బంది

## అన్నదాతలను ఆదుకోవడమే ప్రభుత్వం లక్ష్యం..



చెక్కును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి

పీలేరు నవంబర్ 19 ప్రభాతవార్త:
అన్నదాత సుఖీభవ" పథకంతో వ్యవసాయానికి పెట్టుబడి సహాయంగా రైతులను ఆర్థికంగా ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా పీలేరు పట్టణం లోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో రైతులతో "అన్నదాత సుఖీభవ" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా "అన్నదాత సుఖీభవ" పథకం రైతులకు ఏడాదికి మూడు విడతలుగా 20,000 రూపాయలు వారి ఖాతాల్లో జమ చేస్తూ రైతులకు ఆర్థికంగా ఆదుకుంటుందన్నారు. పీలేరు నియోజకవర్గ వ్యాప్తంగా అర్హులైన అన్నదాతలకు ఒక్కొక్కరికి 7,000 వేల రూపాయలు చొప్పున రెండవ విడతగా 38వేల 490 మందికి గాను 25 కోట్ల 95 లక్షల రూపాయలు రైతుల ఖాతాల్లోకి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జమ చేయనున్నారని ఆయన తెలిపారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పేరుతో మొదటి విడతగా 7000 రూపాయలు జమ చేశారని రెండో విడతగా ప్రతి రైతు ఖాతాలో మరో 7వేల రూపాయలు రైతుల ఖాతాల్లోకి జమ చేయడం జరుగుతుందని మూడో విడతగా 6000 రూపాయలు అందించడం జరుగుతుందని దాంతో ప్రతి ఏడాదికి రైతులకు 20 వేల రూపాయలు చొప్పున వ్యవసాయానికి పెట్టుబడి సహాయం కింద అన్నదాతకు అందజేయడం జరుగుతుందని ఆయన సూచించారు. రాష్ట్రంలోని 6,25838 మంది రైతులకు రెండు విడతలుగా 6310 కోట్లు లబ్ది చేకూరిందని, అన్నదాతల కుటుంబాల్లో ఆనందమే కూటమి ప్రభుత్వానికి ఆశీర్వచనమని ఆయన పేర్కొన్నారు. అర్హులైన రైతులు వివిధ కారణాలవల్ల చనిపోయిన వారి వారసులకు అర్హత బదిలీ (డెత్ మ్యుటేషన్) చేసి ఆ కుటుంబానికి పథకం వర్తించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆయన రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు, ఏఎంసీ చైర్మన్లు, మండల అధ్యక్షులు, సింగల్ విండో అధ్యక్షులు వ్యవసాయ శాఖ అధికారులు, నియోజకవర్గ రైతులు, నాయకులు కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సిఎంకి కర్నూలు రేంజ్ డీఐజీ స్వాగతం..

కడప క్రైం, నవంబరు 19, ప్రభాతవార్త:



అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ రెండో విడత నిధులు విడుదలకు వైఎస్ఆర్ కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం పెండ్లిమర్రి మండలంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులతో కలిసి నిధులు విడుదల కార్యక్రమంలో సీఎం నారా చంద్రబాబునాయుడు మండలంలోని హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా కర్నూలు రేంజ్ డీఐజీ డా.కోయ ప్రవీణ్ సీఎంను కలిసి ఘనంగా స్వాగతం పలికారు.

## ఘనంగా ఇందిరాగాంధీ 18వ జయంతి వేడుకలు



ప్రొద్దుటూరు నవంబర్ 19 ప్రభాతవార్త
ప్రొద్దుటూరు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఎస్ ఇర్ఫాన్ భాషా ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ 108వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా బుధవారం గాంధీ రోడ్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దగ్గర ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం త్యాగాన్ని తమ జీవిత దర్పంగా మార్చుకున్న మహనీయురాలు ఇందిరాగాంధీ అని కొనియాడారు. జాతి అభ్యున్నతి ప్రజాస్వామ్య రక్షణ మహిళా సాధికారత దేశ బలం కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు దేశ సమగ్రత కోసం జీవితం అర్పించిన ఇంద్ర గాంధీ జయంతి సందర్భంగా నివాళులు అర్పించినట్లు ఆయన తెలిపారు ఇంద్ర గాంధీ నాయకత్వ లక్షణాలు హరిత విప్లవం ద్వారా ఆహార భద్రత కల్పించడం గరీబి హటావో ద్వారా పేదల అభ్యున్నతి అను పరీక్షల ద్వారా ప్రపంచానికి భారత శక్తి చాటడం లాంటి ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలతో ఆమె భారత రాజకీయాల్లో చిరస్మరణీయమైన స్థానం సంపాదించుకుందని ఆయన పేర్కొన్నారు తన వ్యక్తిగత జీవితం కంటే దేశ హితాన్ని కోరుకున్న మహోన్నత వ్యక్తి ఇంద్రమ్మ అని ప్రతి భారతీయునికి పూర్తిగా నిలిచిందని తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఖాతాదారులకు మెరుగైన సేవలు



రాజంపేట, నవంబర్19 ప్రభాతవార్త
ఖాతాదారులకు చేరువుగా ఏపీజీబీ సేవలు మరింత విస్తృతం చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చైర్మన్ ప్రమోద్ కుమార్ రెడ్డి తెలిపారు. ఏపీజీబీ స్థాపించి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం రాజంపేట ఏపీజీబీ శాఖ నందు 20 మందికి గృహ రుణాలతో పాటు 4 వాహనాలు పంపిణీ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం సభా భవనం నందు రాజంపేట రీజినల్ మేనేజర్ సుశాంత్ కుమార్ స్వారో ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని శాఖల బ్రాంచి మేనేజర్లు, ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీజీబీ చైర్మన్ ప్రమోద్ కుమార్ రెడ్డి, రాజంపేట కలెక్టర్ హెచ్.ఎస్ భావన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిరువురూ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో సైతం వినియోగదారుడికి విస్తృత సేవలు అందించే ఏకైక బ్యాంకు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు అని తెలిపారు. ఇది దేశంలోనే రెండవ అతిపెద్ద బ్యాంకు అన్నారు.నెట్వర్క్ పరంగా రాష్ట్రంలో రెండవ అతిపెద్ద బ్యాంకు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీజీబీ నాబార్డ్ డి.డి.ఎం విజయ్ విహారి, జనరల్ మేనేజర్ బిధు భూషణ్ లంక, అన్ని శాఖల బ్రాంచి మేనేజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## రాష్ట్రా స్థాయి హాకీ పోటీలకు విద్యార్థిని

గాలివీడు, నవంబర్ 19(ప్రభాతవార్త):



కడప జిల్లా కేంద్రంలో జరిగిన అండర్-17 హాకీ ఎంపిక పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన రవి చంద్ర సీబీఎస్ఈ పాఠశాల 9వ తరగతి విద్యార్థిని ఆర్.సాయిప్రణతి రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైంది. ఈ విషయాన్ని పాఠశాల యాజమాన్యం షింటో ఇమ్మానేఉయల్, సైజుథామస్ మంగళవారం ప్రకటించారు. ప్రణతి సాధనపై పాఠశాల యాజమాన్యం, పాఠశాల ప్రిన్సిపల్ లిజాజాయ్, వ్యాయామ ఉపాధ్యాయురాలు పద్మ, ఉపాధ్యాయవర్గం, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయిలోనూ ప్రణతి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

## దళిత, బీసీ కాలనీలలో ఆలయాల నిర్మాణం

గాలివీడు, నవంబర్ 19(ప్రభాతవార్త):



జిల్లా పరిధిలో శ్రీవాణి ట్రస్టు ద్వారా దళితవాడలు బీసీ కాలనీలలలో ఆలయాల నిర్మాణం చేపడుతున్నట్లు జిల్లా దేవాదాయ శాఖ అధికారి విశ్వనాథం పేర్కొన్నారు. బుధవారం పులికుంట గ్రామం మంగళపల్లి, రెడ్డివారిపల్లి వడ్డెపల్లిలో శ్రీవాణి ట్రస్టు ద్వారా దేవాలయాల నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా శ్రీవాణి ట్రస్టు ద్వారా ఆలయాల నిర్మాణం కోసం దరఖాస్తు చేసిన గ్రామాల్లో మొదటి దశలో స్థలాలను పరిశీలించడం జరుగుతున్నదని తెలిపారు. స్థలాల పరిశీలన అనంతరం దేవాలయాల నిర్మాణం కోసం వాటి మంజూరు కొరకు దేవాదాయ శాఖ కమిషనర్‌కు నివేదికలను పంపడం జరుగుతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఏఈ రవితేజ, సర్పంచ్ పార్థసారథిరెడ్డి, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడా సమగ్ర వితరణ

పెనగలూరు నవంబర్ 19 ప్రభాతవార్త



మండలంలోని కట్ట వారి పల్లి పంచాయతీ పరిధిలో ఉన్న మారుమూల మల్లాలమ్మ దిన్నె ఎస్టీ కాలనీలో ప్రత్యేక పాఠశాలలో విధిన విశిస్తున్న విద్యార్థులకు చక్రం పేట క్లస్టర్ ఇంచార్జి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లేబాకు గోపాలకృష్ణ బుధవారంక్రీడా సామాగ్రిని వితరణ చేశారు. ఈ సందర్భంగా కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక పాఠశాలలో విధిన విశిస్తున్న గిరిజన విద్యార్థు లు చదువుతోపాటు క్రీడల్లో కూడా ఆసక్తి పెంచుకొని రాణించాలన్న సంకల్పంతో ప్రోత్సహించడం కోసం ఈ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఉన్నత పాఠశాల పిడి షబానా లమ్మ దిన్నె పాఠశాల ఉపాధ్యాయురాలు వాణి పాల్గొన్నారు.

## ఘనంగా కార్తీక మాస ముగింపు పూజలు

పెనగలూరు నవంబర్ 19 ప్రభాతవార్త
మండలంలోని పలు శివాలయాలు విఘ్నేశ్వర స్వామి దేవాలయాలలో బుధవారం పవిత్రమైన కార్తీక మాసం ముగింపు పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని పి కొత్తపల్లి లో గల కార్య సిద్ధి వినాయక స్వామి దేవాలయంలో శ్రీవారి మూలవిరాట్ కు భక్తులు తెల్లవారుజామునండి వివిధ రకాల అభిషేకాలు ప్రత్యేక పూజలు పూల అలంకరణలతో ఘనంగా పూజలు జరిపారు నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



## విగ్ర ప్రతిష్ట మహోత్సవాన్ని జయప్రదం చేయాలి

ఈనెల 24 నుండి 28 వరకు వైభవంగా విగ్ర ప్రతిష్ట మహోత్సవం

ఎమ్మెల్సీ డి.సి గోవిందరెడ్డికి ఆహ్వానం పలికిన కమిటీ సభ్యులు



బద్వేల్ అర్బన్ నవంబర్ 19 ప్రభాతవార్త :
బద్వేల్ మున్సిపాలిటీ పరిధి తెలుగు గంగా కాలనీలో నూతనంగా నిర్మాణం చేపట్టిన శ్రీ సీతా లక్ష్మణ హనుమత్సమేత శ్రీ రామచంద్ర స్వామి వారి నూతన విగ్రహా ప్రతిష్ట మహోత్సవం మరియు కుంబాభిష్కేక కార్యక్రమాన్ని ఈనెల 24వ తారీఖు సోమవారం నుండి 28 శుక్రవారం వరకు అంగరంగ వైభవంగా కనుమల్ల సత్యనారాయణ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు, తెలుగు కాలనీలో ఆహ్లాదకరమైన వాతావరణంలో దాదాపు కోటి రూపాయలు వ్యయంతో నిర్మాణం చేపట్టిన శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం పలువురు భక్తులను ఆకట్టుకునే విధంగా నిర్మాణం చేపట్టడం జరిగింది. స్వామి వారి విగ్రహా ప్రతిష్ట మహోత్సవానికి ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి, వైయస్సార్సీపి విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించినట్లు వైఎస్ఆర్సిపి పార్టీ సీనియర్ నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి వంకెల పెద్ద పోలిరెడ్డి, జిల్లా సెక్రెటరీ యాక్టివ్ ప్రధాన కార్యదర్శి పొన్నపోలు బ్రహ్మానందరెడ్డి, బిజీవేముల అంకిరెడ్డి,పార్టీ సీనియర్ నాయకులు ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్ పల్లె సుబ్బారెడ్డి, మరియు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆహ్వానించారు, అనంతరం ఎమ్మెల్సీ డి.సి గోవిందరెడ్డి మాట్లాడుతూ బద్వేల్ పట్టణం తెలుగు గంగ కాలనీలో అత్యంత సుందరీ కృరగా నిర్మాణం చేపట్టిన ఆలయం విగ్ర ప్రతిష్ట మహోత్సవానికి తాము తప్పక విచ్చేస్తామని ప్రజలందరికీ స్వామివారి అనుగ్రహంతో అష్టైశ్వర్య ఆయు ఆరోగ్యాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు, ఈనెల 24 నుండి జరగబోవు స్వామి వారి విగ్రహా ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమానికి బద్వేల్ నియోజకవర్గ స్థాయి ప్రజలందరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని పలువురు కమిటీ సభ్యులు పలువురికి ఆహ్వానం పలికారు,వీరి వెంట పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వాడి వేడిగా మండల సర్వసభ్య సమావేశం



సిద్దవటం నవంబర్ 1 ప్రభాతవార్త.
సిద్దవటం ఎంపిడిఓ సభ భవనంలో మంగళవారం ఎంపీపీ జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు ఏమైనా సమస్యలు ఉంటే తెలపాలని ఎంపిడిఓ కోరడంతో పెద్దపల్లి ఎంపీటీసి సభ్యురాలు రమాదేవి మాట్లాడుతూ సభ్యుల సంతకాల కోసమే మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఉందని తెలిపారు. ఈ విషయంపై ఎంపిడిఓ స్పందిస్తూ తాను ఏడాది క్రితమే రావడం జరిగిందని ఏవైనా సమస్యలుంటే రాత పూర్వకంగా ఇవ్వాలని ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా బొగ్గిడివారి పల్లి ఎంపీటీసి సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి నేకనాపురంలో రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ్ రెడ్డి నిధులతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభించకుండానే ప్రైవేటు వ్యక్తి నీళ్లు విక్రయిస్తున్నారని అతనికి తాళాలు ఎవరిచ్చారని సభ దృష్టికి తీసుకొచ్చి రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎంపిడిఓ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేస్తారన్నారు. మాధవరం 1 గ్రామ పంచాయతీ సచివాలయం 2 వద్ద ఎనుములు కట్టి వేసి మురికి పేరుకుని ఉందని అక్కడ పైప్ లైన్ లీకేజీ ఉండడంతో పైప్ లైన్ నుంచి మురికి నీరు వెళ్తుండడంతో మహబూబ్ నగర్ వాసులకు కలుషితమైన నీరు వెళ్తుందని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ నరసయ్య స్పందిస్తూ ఆ విషయం వాస్తవమేనన్నారు. ఎనుములు కట్టే వారికి నోటీసులు జారీ చేసి పైప్ లైన్ లీకేజీలను అరికట్టి మంచి నీరు అందిస్తామని వివరణ ఇచ్చారు. అలాగే మాచుపల్లి గ్రామ పంచాయతీలో మురికి కాల్వలపై డ్రైనేజీ నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఉప మండలాధ్యక్షులు నారపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి సభ దృష్టికి తెచ్చి ఆయా పనులకు నిధుల కేటాయింపుకు సంబంధించిన అర్జీని సమర్పించారు. మండల సర్వసభ్య సమావేశానికి నేకనాపురం సర్పంచ్ ఈశ్వర్ రెడ్డి మినహా ఏ ఒక్క సర్పంచ్ రాకపోవడం గమనార్హం. వైద్య ఆరోగ్యం, వ్యవసాయం, పక్కా గృహాలు, పశు సంవర్ధక శాఖ, ఆర్డబ్ల్యూఎస్, ఉపాధి హామీ, అంగన్వాడీ, డ్వాక్రా గ్రూపులకు సంబంధించిన అధికారులు వారి శాఖలకు సంబంధించిన అంశాలను సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, ఎంపీటీసి లు సుబ్బమ్మ, దారపునేని లక్ష్మీదేవి, రమాదేవి, దేరంగుల శివయ్య, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.





## పీఎం కిసాన్ నిధుల విడుదల

పులివెందుల నవంబర్ 19, ప్రభాత వార్త :
కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఉన్న అర్హులైన రైతు కుటుంబాలకు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పిఎం కిసాన్) యోజన 21వ విడత నిధులను విడుదల చేయడం వల్ల దేశవ్యాప్తంగా 11 కోట్ల పైగా రైతులకు లబ్ధి చేకూరింది అని ఏపీ మార్క్ఫెడ్ డైరెక్టర్ మరియు బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి వంగల శశి భూషణ్ రెడ్డి అన్నారు . బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రధాని మోదీ ఈ విడత కింద ప్రతి అర్హులైన రైతు కుటుంబానికి ..2,000 చొప్పున నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేయడం జరిగిందని దీనితో దేశవ్యా ప్తంగా భారీ స్థాయిలో రైతులకు లబ్ధి చేకూరింది అన్నారు. ఈ విడతతో దేశంలోని 11 కోట్లకు పైగా రైతు కుటుంబాలు లబ్ధిపొందాయి అని పీఎం కిసాన్ యోజన ప్రారంభం నుండి ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో 3.70 లక్షల కోట్లకుపైగా నిధులు నేరుగా జమ చేయబడ్డాయన్నారు. ఎన్డీఏ పాలనలో దేశవ్యాప్తంగా రైతుల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యమని అన్నారు.

# 2వ విడుద కిసాన్ సమ్మాన్ నిధి నిధుల విడుదల

**మైదుకూరు, నవంబర్ 19, ప్రభాతవార్త:**

మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రధానమంత్రి 2వ విడత కిసాన్ సమ్మాన్ నిధి నిధుల విడుదల ప్రత్యక్షప్రసారం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అతిథిగా విచ్చేసి రాష్ట్ర ప్రభుత్వం రైతులకు తన వంతుగా రూ: 14వేలు సంవత్సరానికి అన్నదాత సుఖీభవ పథకం ద్వారా అందించి రైతు పక్షపాత ప్రభుత్వం నిలబడిందని కొనియాడారు. శశి భూషణ్ రెడ్డి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా రైతులకు ప్రయోజనాలు చేకూరే వివిధ పథకాల గురించి ఫసల్ బీమా యువజన ద్వారా పంట బీమా అందిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి విపత్తుల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించుటకు సకాలంలో పంట నష్ట పరిహారాన్ని అందించేందుకు కృషి చేస్తుందని తెలియజేశారు. మైదుకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏపీ రవీంద్ర రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ నియోజకవర్గంలో బ్రహ్మ సాగర్ లో అధిక నీటిని నిలువ చేసి రైతులకు నేటి ఇబ్బందులను తొలగించడానికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తగిన చర్యలు తీసుకుంటున్నారని కొనియాడారు. కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త మరియు అధిపతి కిసాన్ సమ్మాన్ నిధి పథకం అవశ్యకత తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణమ్మ, సరస్వతి, స్పెషల్ ఆఫీసర్ సుబ్బరాయుడు, బిజెపి అసెంబ్లీ కన్వీనర్, భీమయ్య నియోజకవర్గ అధ్యక్షులు, మైదుకూరు ఏ డి



ఏ కృష్ణమూర్తి,ఏ.ఓ బాలగంగాధర్ రెడ్డి, ఇతర వ్యవసాయ అధికారులు నియోజకవర్గ శాసనసభ్యులు చేతులు మీదుగా రైతులకు అన్నదాత సుఖీభవ పథకం చెక్కును అందించారు. డాక్టర్ విజయనిర్మల, డాక్టర్ బి.ఎస్ కాంతి శ్రీ, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాలగంగాధర్ రెడ్డి అగ్రికల్చర్ ఆఫీసర్ మైదుకూరు ఇతర వ్యవసాయ, ఉద్యాన సెరికల్చర్ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు మహిళలు ఏపీసిఎన్ఎఫ్ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేశారు.

## పంచాయతీ కార్యాలయానికి భూమి పూజ

**కాశినాయన నవంబర్ 19 ప్రభాతవార్త**



మండలంలోని మిద్దెల గ్రామంలో శుక్రవారం ఎంపీడీవో మైథిలి, బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో రూ.38 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న నూతన గ్రామపంచాయతీ కార్యాలయానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రజలు వారి యొక్క పనుల కోసం ఇతర గ్రామంలో ఉన్న సచివాలయానికి వెళ్లకుండా వారి గ్రామంలోనే సమస్యలు పరిష్కరించుకునేందుకు నూతన సచివాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ పుల్లయ్య,ఉపాధి హామీ ఎపిఒ జయరాములు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నాగేంద్రరెడ్డి, కాంట్రాక్టర్ బాల గురివిరెడ్డి, సర్పంచ్ చిన్న ఖాజావలి, టిడిపి నాయకులు కృష్ణారెడ్డి, పోలిరెడ్డి,పీరావలీ,కొండారెడ్డి, రోషి రెడ్డి, వెంకటరామిరెడ్డి, రామనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో మహిళా దినోత్సవం

**చిన్నమండెం నవంబర్ 19 ప్రభాతవార్త:**



జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా చిన్నమండెం శాఖ గ్రంథాలయంలో బుధవారం మహిళా దినోత్సవం సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహమ్మద్ టీచర్ మాట్లాడుతూ ఇందిరాగాంధీ మొట్టమొదటి ప్రధానమంత్రిని చాలా మంచి సంస్కరణలు తీసుకొచ్చి దేశానికి సేవ చేశారని కొనియాడారు. గ్రంథ పాలకులు రెడ్డి శేఖర్ మాట్లాడుతూ ప్రతి మహిళ కూడా బాగా చదువుకొని ఉన్నత స్థానానికి చేరుకోవాలని ప్రతి ఒక్క మహిళకి సమాజంలో ఆదర్శంగా నిలవాలని కొనియాడారు. గురువారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు ఉత్సవాల నందు విద్యార్థులకి బహుమతుల ప్రధానోత్సవం జరుగునని గ్రంథ పాలకుడు తెలియజేశారు.

## మహిళాశక్తిని చాటిన తేజోమూర్తి లక్ష్మీబాయి

**పొద్దుటూరు అర్బన్, నవంబర్ 19 ప్రభాత వార్త**



స్థానిక శ్రీరాములు పేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో బుధవారం సంస్కృతి సేవా సమితి ఆధ్వర్యంలో వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి 196వ జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ బాల్యంలో మణికర్ణికగా పిలువబడిన ఝాన్సీ లక్ష్మీబాయి 1857 సిపాయిల తిరుగుబాటులో కీలక పాత్ర పోషించిన ఝాన్సీ ఆంగ్లేయులతో పోరాడుతూ గ్వాలియర్ కోటలో వీరమరణం పొందారన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో అవార్డీ టీచర్స్ అసోసియేషన్ కార్యదర్శి కె.యల్.వి. రమణయ్య, భజరంగ్ దళ్ భాస్కర్ రెడ్డి, షేక్షావల్లి పాల్గొన్నారు.

## రైతుల ఖాతాలలో సుఖీభవ నిధుల జమ

**ప్రొద్దుటూరు నవంబర్ 19 ప్రభాతవార్త**



అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం ద్వారా ప్రతి రైతు ఖాతాలలో నగదు జమ చేసి రైతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి నిదర్శనమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ 2వ విడత పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతిగా పనిచేస్తుందని ప్రతి రైతు కలలో వెలుగులు నింపడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా డిసిఓ మండల ప్రత్యేక అధికారి వెంకటసుబ్బయ్య మాజీ జెడ్పిటిసి సభ్యులు తోట మహేశ్వర్ రెడ్డి అగ్రికల్చర్ ఏడి అనిత ప్రొద్దుటూరు మార్కెట్ కమిటీ చైర్మన్ వద్ది సురేఖ చెన్నంరాజు పల్లె సొసైటీ అధ్యక్షులు వల్లేటి చంద్రశేఖర్ రెడ్డి లింగాపురం ఏజీఆర్ బ్యాంకు చైర్మన్ సిద్ధారెడ్డి నాగమణి రెడ్డి టంగుటూరు సొసైటీ అధ్యక్షులు బాషా తాసిల్దార్ గంగయ్య ఎంపీడీవో సూర్యనారాయణ రెడ్డి ఏవో వరహరి మరియు టిడిపి నాయకులు కొర్రపాడు సుధాకర్ రెడ్డి వద్ది బాలుడు వెలవలి ప్రతాపరెడ్డి పెదమ్మ రాజు పల్లె వెంకటసుబ్బయ్య తాళ్లమాపురం మండ్ల మల్లికార్జున మరియు నియోజకవర్గంలోని రైతు సోదరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర యోగాసన పోటీలకు విద్యార్థి ఎంపిక

**లక్కిరెడ్డిపల్లె నవంబర్ 19, ప్రభాతవార్త**



మండల కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న శ్రీమన్నారాయణ రాష్ట్ర స్థాయి యోగాసనం పోటీలకు ఎంపికైనట్లు ప్రధాన ఉపాధ్యాయుడు రమేష్ పిడి వెంకటరమణ తెలిపారు ప్రకాశం జిల్లా బాపట్లలో 23 తేదీన జరుగు యోగాసనా పోటీలకు ఎంపికైన తెలిపారు యోగాసన పోటీలలో అండర్ 19 కింద శ్రీమన్నారాయణ పాల్గొంటారని వాళ్ళు తెలిపారు

## చెరువు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

**మదనపల్లె, నవంబర్ 19 ప్రభాతవార్త :**



పట్టణ నడిబొడ్డున ఉన్న కోమిటివానిచెరువు పరిరక్షణకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోమిటివానిచెరువు ఆక్రమణ దారులపై కేసులు నమోదు చేయడం పట్ల రెవెన్యూ అధికారులను అభినందించారు. పట్టణంలోని ప్రముఖులను, ప్రజా సంఘాలను రాజకీయ పార్టీల నాయకులను కలుపుకొని అక్రమ నిర్మాణాల తొలగింపు కోసం చేసిన కృషిని గుర్తు చేశారు. మున్సిపల్ అధికారులు కోమిటివానిచెరువును సుందరీకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. కట్ట మరమ్మత్తులు చేయాలన్నారు. వాకింగ్, ఫుట్‌పాత్, గార్డెనింగ్‌ను ఏర్పాటు చేసి బోటింగ్‌ను ఏర్పాటు చేయాలని ఇందుకు అధికారులు సహకరించాలన్నారు.

## గృహ నిర్మాణాల కోసం నమోదు చేసుకోండి

**ముద్దనూరు, నవంబర్ 19, ప్రభాతవార్త:**

ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద పక్కా గృహ నిర్మాణాల మంజూరు కొరకు నవంబర్ 30వ తేదీ వరకు గడువు ఉందని మండల ప్రజలు అర్హత కలిగిన ప్రతి కుటుంబం పక్కా గృహ నిర్మాణాల కొరకు స్థానిక సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ద్వారా నమోదు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ ప్రతాప్ రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ ద్వారా అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ రేషన్ కార్డు, భార్యాభర్తల ఆధార్ కార్డు అందజేసి ఇంటి స్థలాన్ని జియో టాకింగ్ ద్వారా నమోదు చేసి గృహ నిర్మాణాన్ని మంజూరు చేస్తారని పేర్కొన్నారు. ఈ సదవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోపరుచుకోవాలని కోరారు.

## మరిన్ని మెరుగైన సేవలు అందిస్తాం

**ప్రొద్దుటూరు నవంబర్ 19 ప్రభాతవార్త**



ప్రొద్దుటూరు కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు ద్వారా ఖాతాదారులకు భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని టౌన్ బ్యాంకు అధ్యక్షులు బొగ్గుల వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం 72వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా స్థానిక ప్రొద్దుటూరు కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు ఆవరణలో బ్యాంకు ఛైర్మెన్ బొగ్గుల వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన సహకార సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ఠ అతిథిగా జిల్లా సహకారశాఖాధికారి బి. వెంకట సుబ్బయ్య, ముఖ్య అతిథులుగా డివిజినల్ సహకార శాఖాధికారి వై.యస్.సి. సత్యానందం, జిల్లా సహకార ఆడిట్ అధికారి యం. బ్రహ్మానందరెడ్డి, కోఆపరేటివ్ ట్రైనింగ్ కళాశాల, ప్రొద్దుటూరు ప్రిన్సిపాల్ వి. శ్రీనివాస్ విచ్చేశారు. ఈ కార్యక్రమంలో సహకార వ్యవస్థ గొప్పతనాన్ని సమిష్టి ప్రయోజనాలను అతిథులు సభ్యులకు తెలియజేశారు. బ్యాంకు ఛైర్మెన్ బొగ్గుల వెంకట సుబ్బారెడ్డి మాట్లాడుతూ బ్యాంకు అభివృద్ధికి కోఆపరేటివ్ అధికారులు, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, ఖాతాదారులు సంపూర్ణ సహకారంతోనే సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఛైర్మెన్ బొగ్గుల వెంకట సుబ్బారెడ్డి, వైస్ ఛైర్మెన్ బి. మహమ్మదోస్, బ్యాంక్ డైరెక్టర్లు మరియు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారాన్ని కచ్చితంగా అందించాలి

**లక్కిరెడ్డిపల్లి; నవంబర్ 19, ప్రభాత వార్త**



మాట్లాడుతున్న ఎంపీడీవో రెడ్డయ్య

ప్రీస్కూల్లో చదువుతున్న చిన్నపిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని కచ్చితంగా అందించాలని ఎంపీడీవో రెడ్డయ్య పేర్కొన్నారు బుధవారం పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్లు సమయపాలన పాటించి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణీలకు, బాలింతలకు చిన్న పిల్లలకు సకాలంలో అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది సుధా అంగన్వాడి కార్యకర్త ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## గుంతల రోడ్ల మరమ్మత్తులకు చర్యలు తీసుకోండి

### వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్

**మదనపల్లె, నవంబర్ 19 ప్రభాతవార్త :**



కోటి సంతకాలు చేపడుతున్న దృశ్యం

నియోజకవర్గమంతా రోడ్లన్నీ గుంతల మయంగా మారాయని వీటి మరమ్మత్తులకు రోడ్లు భవనాల శాఖామంత్రి చర్యలు తీసుకోవాలని వైసిపి నియోకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ కోరారు. బుధవారం పట్టణ పరిధిలోని 30వ వార్డులో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ కోటిసంతకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చారిత్రాత్మకమైన నేపథ్యం ఉన్న మదనపల్లెలో రోడ్లన్నీ అధ్వాన్నంగా ఉన్నాయని వాటిపై దృష్టి సారించాలని ఆయన కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణం, రూరల్‌లో ప్రయాణం చేయాలంటే వాహనదారులు, పాదచారుకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు అనీషారెడ్డి, డాక్టర్ అనీల్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్ సరిత, బాలగంగాధర్‌రెడ్డి, ఈశ్వర్‌నాయక్, మాధవరెడ్డి, రఫి, శారదారెడ్డి, చిప్పిలి మల్లికార్జునరెడ్డి, యశ్వంత్, సుబ్రమణ్యంరెడ్డి, నాగరాజ, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రైలు కిందపడి మహిళ మృతి

**మదనపల్లె క్రైమ్ నవంబర్ 19 ప్రభాతవార్త.**

కురబలకోట రైల్వే స్టేషన్లో రైలు దిగుతుండగా ప్రమాదవశాత్తు కిందపడి ఓ మహిళా మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కురబలకోట ఎస్సీ కాలనీకి చెందిన దొడ్డప్ప భార్య గంగులమ్మ(58) సొంత పనిపై సొంత పనిపై చిత్తూరు జిల్లా కల్లూరుకు వెళ్ళింది. పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి గుంతకల్లు కి వెళ్లే ప్యాసింజర్ రైలులో వచ్చి కురబలకోట రైల్వేస్టేషన్‌లో దిగుతూ ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయింది. ఈ ప్రమాదంలో గాయపడిన ఆమెను 108 వాహనంలో మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి, ప్రథమ చికిత్స అనంతరం ఆమె పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం వెంటనే తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. దీంతో ఆమెను తిరుపతికి తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తుండగానే మృతి చెందింది. ఘటనపై కదిరి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహం కు శవపరీక్షల పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## విద్యార్థులకు వ్యాసరచన డ్రాయింగ్ పోటీలు

**వేంపల్లి :నవంబర్ :19:(ప్రభాత వార్త )**



58 వ గ్రంథాలయ వారోత్సవాలో భాగంగా వేంపల్లి గ్రంథాలయ అధికారిని వనజ కుమారి ఆధ్వారంలో జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ నందు విధార్థులకు బుధవారం వ్యాసచారిచనాలు,డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గున్నారు.

## గ్రామీణాభివృద్ధికి ముందడుగు వేసిన గ్రామసభ

**తొండూరు నవంబర్ 19 ప్రభాతవార్త :**



స్వామిత్వ పంచాయతీ రాజ్‌తో గ్రామాభివృద్ధికి నూతన దిశ తొండూరు మండలంలోని ఊడవగండ్ల గ్రామంలో నిర్వహించిన స్వామిత్వ పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి ప్రత్యేక గ్రామసభ గ్రామానికి కొత్త ఊపునిచ్చింది. గ్రామ సర్పంచ్ దాసరి ప్రతిమా ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో, విస్తృత ప్రజాస్పందన కనిపించింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న వైఎస్సార్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డి వి శశికాంత్ రెడ్డి మాట్లాడుతూ,"గ్రామాభివృద్ధి కోసం మా పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుంది. గ్రామంలో ఎదురయ్యే సమస్యలకు తక్షణమే స్పందిస్తానని, ప్రజావసరాల కోసం ఎప్పుడూ అందుబాటులో ఉంటాననీ" హామీ ఇచ్చారు. గ్రామస్తులు కూడా తమ సమస్యలు, అభిప్రాయాలను ప్రజా ప్రతినిధుల సమక్షంలో ధైర్యంగా వెల్లడించారు. నిర్వాహకులు మాట్లాడుతూ, ఇటువంటి స్వామిత్వ పంచాయతీ రాజ్ గ్రామసభలు భవిష్యత్తులో గ్రామాభివృద్ధికి మార్గదర్శకాలు అవుతాయని, ఊడవగండ్ల ప్రజల ఆశయాలను నెరవేర్చే దీపస్తంభాలుగా నిలుస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

## మహిళా చట్టాలపై అవగాహన..

**కడప కార్పొరేషన్ నవంబర్ 19 ప్రభాతవార్త:**



58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా కడప నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల మహిళా దినోత్సవం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి (ఎఫ్ఏసి) ఎలిశెట్టి పవన్ కుమార్ ఆధ్వర్యంలో జరిపారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించినారు. బ్లైండ్ స్కూల్ విద్యార్థి అయిష ప్రార్థన గీతాన్ని ఆలపించారు. పీహెచ్ఎస్ఎమ్ సి.మంజులవాణి, విశ్రాంతి సర్కిల్ ఇన్ స్పెక్టర్ యం.శాంతమ్మ, వన్ స్టాప్ సెంటర్ (సఖి) సైకాలజిస్టు పివి.సునీత మాట్లాడుతూ మహిళా భద్రత కోసం పోక్సో చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి (ఎఫ్ ఏ సి) ఎలిశెట్టి పవన్ కుమార్, నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల లెక్చరర్లు అనంత లక్ష్మి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కాలువలు శుభ్రంగా ఉంచాలి

**కడప కార్పొరేషన్ నవంబర్ 19 ప్రభాతవార్త:**



కాలువలు పరిశుభ్రంగా ఉంచాలని ఎప్పటికప్పుడు సిల్ట్ తొలగించాలని ప్రజా వైద్యాధికారి సొధా గిరి రమేష్ శానిటరీ సిబ్బందికి సూచనలు చేశారు. బుధవారం కడప నగరంలోని 28వ డివిజన్ కృష్ణ సర్కిల్, మేకల దొడ్డి, ఆకులు వీధి, దేవుని కడప రోడ్డులో పర్యటించిన ఆయన పారిశుద్ధ్య కార్మికులకు పలు సూచనలు అందించారు. క్లాప్ ఆటోలు ప్రతి ఇంటి నుండి చెత్తను సేకరించే విధంగా చర్యలు తీసుకోవాలి. ప్రజల నుండి ఫిర్యాదులు పరిష్కరించాలన్నారు. రోడ్లపై చెత్త నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు ఎత్తి వేయాలని ఆదేశించారు. ప్రతిరోజు పగటిపూట మోరీల మధ్యలో ఫాగింగ్ చేయాలన్నారు. చిన్న చిన్న సైడ్ కాలువలలో మురుగునీరు ప్రవహించే విధంగా శుభ్రం చేయాలని సంబంధిత శానిటరీ ఇన్స్పెక్టర్ లు, సానిటరీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కుష్టువ్యాధిని మొదటి దశలోనే నివారించాలి

**రామసముద్రం నవంబర్ 19ప్రభాతవార్త**



కుష్టి వ్యాధిపై భయపడవలసిన అవసరం లేదని పెద్దకురప్పల్లె సిహెచ్ఓ ఉమాదేవి అన్నారు. మండలంలోని పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ తిరుమల రెడ్డిపల్లె గ్రామంలో డాక్టర్ జాహ్నవి, డాక్టర్ నాగరాజు, ఉమాదేవి ఆధ్వర్యంలో బుధవారం జాతీయ కుష్టు వ్యాధి కార్యక్రమం ఫీవర్, లార్వా ఇంటి ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ రాగి మచ్చలు కలిగి స్పర్శ లేకుండా ఉన్నట్లయితే భ యపడాల్సిన అవసరం లేదన్నారు. ఈ సర్వే 19 నుండి 30వ తేదితో ముగుస్తుందన్నారు. మచ్చలపై ప్రతి ఇంటిని దర్శించి వివరాలను ఇంటి గోడలపై రాయడం జరుగుతుందన్నారు. గ్రామపంచాయతీలు మండలంలో జ్వరాలు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైన చోట వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఓ ఉమాదేవి ఆశావర్కర్స్ లక్ష్మీదేవి, గౌతమి, భానుప్రియ ప్రజలు పాల్గొన్నారు.

## కుదురుచీమనపల్లెలో స్వామిత్వ గ్రామసభ

**రామసముద్రం, నవంబర్ 19 ప్రభాతవార్త**



కుదురుచీమనపల్లిలో బుధవారం సర్పంచ్ ఎం. శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షతన మండల డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్ఏ గఫూర్ ఆధ్వర్యంలో స్వామిత్వ గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఈ గ్రామసభ నందు గ్రామ పంచాయతీ పరిధిలోని ఇంటి యజమానులకు వారి ఇంటి ఖాళీ స్థలము మరియు ఇంటి నిర్మాణంతో కొలతలు తీసి 9(2) నోటీసులు పంపిణీ చేసి వాటిలో గల కొలతలు సరిచూసుకొని ఏవైనా అభ్యంతరములు ఉన్న యెడల గ్రామసభలో రాతపూర్వకంగా తెలియజేయాలని గ్రామ ప్రజలకు తెలియజేయడమైనదని, అభ్యంతరములను స్వీకరించడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి పంచాయతీ కార్యదర్శి యస్ మారప్ప, టిడిపి నాయకులు లోకేష్ రెడ్డి, అనిల్ కుమార్ సచివాలయ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పీఎం కిసాన్ మెగా చెక్కు పంపిణీలోఎమ్మెల్యే

**రామసముద్రం, నవంబర్ 19 ప్రభాతవార్త**



మదనపల్లిలో సిఎస్ఐ కమ్యూనిటీ హాల్ నందు బుధవారం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం మెగా చెక్కును ఎమ్మెల్యే షాజహాన్ భాష, ఎఎంసి చైర్మన్ జంగాల శివరాం రాయల్ ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగింది. ఈ పథకం ద్వారా మండలంలోని 7002 మంది రైతులకు అన్నదాత సుఖీభవ ద్వారా 5000 రూపాయలు ,పీఎం కిసాన్ ద్వారా 2000 రూపాయలు లబ్ది చేకూర్చబడింది. ఈ కార్యక్రమంలో రామసముద్రం మండలం నుంచి యువ నాయకులు గుండ్లపల్లి లోకేష్ రెడ్డి, కొమ్ము శ్రీనివాసులు, వెంకటరమణ, నాగప్ప, టేకుపల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంపు

**బద్వేలు, నవంబర్ 19, ప్రభాతవార్త**



పట్టణంలోని బిజీవేముల వీరారెడ్డి డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్2 ప్రోగ్రామ్ ఆఫీసర్ సి.హెచ్. ఈశ్వరయ్య 50 మంది వాలంటీర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పెషల్ క్యాంపు బుధవారానికి మూడవ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా పెద్దిరాజుపల్లిలో ఆరోగ్యం మరియు పారిశుద్యం పై అవగాహన కల్పించడమైనది. ఈ కార్యక్రమంలో డా. సంపత్ పర్యవేక్షణలో డాక్టర్ ఓబులేసు , హైమావతి ఇతర నర్సులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## సాంకేతిక లోపాలతో ఎస్వీయూ ఫీజు మాడ్యూల్

**పీలేరు, నవంబర్ 19 ప్రభాతవార్త:**

ఎస్వీ విశ్వవిద్యాలయం యూజీ ఆన్లైన్ పరీక్ష ఫీజు మాడ్యూల్ కారణంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సాంకేతిక ఇబ్బందులను పరిష్కరించాలని ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం స్థానిక పత్రిక సమావేశంలో మాట్లాడుతూ ఎస్వీ విశ్వవిద్యాలయం, తిరుపతి వారు నవంబర్ 2025 యూజీ 3వ మరియు 5వ సెమెస్టర్ పరీక్షల కోసం కొత్త ఆన్లైన్ ఫీజు మాడ్యూల్‌ను ప్రవేశపెట్టినప్పటి నుంచి అనేక సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. అనేక మంది విద్యార్థులకు తమ సబ్జెక్టులు, పేపర్లు కనిపించకపోవడం వల్ల రిజిస్ట్రేషన్ పూర్తిచేయడం కష్టమవుతోంది. ఇదే సమయంలో చెల్లించిన ఫీజులు చాలా మంది విద్యార్థుల ఖాతాల్లో ఇప్పటికీ ప్రతిబింబించడం లేదు. ఈ కారణంగా పరీక్ష ప్రక్రియను సమయానికి పూర్తిచేయలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సాంకేతిక లోపాలు కొనసాగుతున్నప్పటికీ, విశ్వవిద్యాలయం ఫీజు చెల్లింపులకు చాలా తక్కువ గడువు మాత్రమే ఇవ్వడం అన్యాయం అని అమృత్ తేజ అన్నారు. ఆలస్య రుసుము 3వేలు ఉండడం వల్ల విద్యార్థులపై భారీ ఆర్థిక భారం పడుతోంది. ఈ పరిస్థితుల్లో విద్యార్థులు మరియు కళాశాలలుకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు కాబట్టి, వెంటనే సాంకేతిక లోపాలను సరిచేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చేయాలని ఎస్వీ విశ్వవిద్యాలయం అత్యవసర చర్యలు తీసుకోవాలని ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ డిమాండ్ చేశారు.

## రెవెన్యూ రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

**పీలేరు నవంబర్ 19 ప్రభాతవార్త:**



ఆత్మీయ సమ్మేళనంలో రెవెన్యూ రిటైర్డ్ ఉద్యోగులు

రెవెన్యూ శాఖలోని రిటైర్డ్ ఉద్యోగుల 7వ ఆత్మీయ సమ్మేళనం స్థానిక ఎన్ఎన్ఆర్ గార్డెన్స్లో ఘనంగా నిర్వహించారు. బుధవారం వీఆర్వోల స్థాయి నుంచి డిప్యూటీ కలెక్టర్ల వరకు వివిధ శ్రేణుల పదవీ విరమణ చేసిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రిటైర్డ్ ఉద్యోగులు తమ ఉద్యోగ జీవితంలో ఎదురైన అనుభవాలు, సవాళ్లు, ప్రజా సేవలో ఎదురైన మధుర సంఘటనలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ సరస్వతమ్మ, విశ్రాంత తహశీల్దార్లు కె.ఆర్. రమేష్, వి. ప్రభాకర్ నాయుడు. సి.ఆర్. శేషయ్య, టి. బసవయ్య, కె. వెంకటేష్, సీనియర్ సహాయకుడు ప్రభాకరన్, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యం ఇంటింటా సౌభాగ్యం

**వేంపల్లి: నవంబర్ 19 (ప్రభాతవార్త):**



ఇందిరమ్మ రాజ్యం మళ్లీ రావాలన్నా, ఇంటింటా సౌభాగ్యం వెల్లి విరియాలన్నా అది కాంగ్రెస్తోనే సాధ్యమని రాజ్యసభ మాజీ సభ్యులు,ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు .బుధవారం వేంపల్లిలో స్వర్గీయ ఇందిరమ్మ 108వ జయంతిని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ ఇందిరమ్మ చరిత్రకారిణి, చరితార్తురాలు అని కీర్తించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక ,లౌకిక పార్టీ అయినకాంగ్రెస్ పార్టీకి ఏడు సంవత్సరాలు జాతీయ అధ్యక్షురాలుగా సేవలందించి పార్టీని పటిష్టం, విస్తృతం చేశారన్నారు. మళ్లీ ఇందిరమ్మ రాజ్యం రావాలంటే, ఇంటింటా సౌభాగ్యం వెల్లివిరియాలంటే అది కాంగ్రెస్ తోనే సాధ్యమని, అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని అందుకు ప్రతి ఒక్కరు అంకితభావంతో కృషి చేయాలని తులసి రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్రెడ్డి అలివేలమ్మ, బండారు వెంకటేశు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే కూటమి లక్ష్యం

**వేంపల్లి: నవంబర్ 19 (ప్రభాత వార్త):**



రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని భాజపా జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. ఈ మేరకు వేంపల్లి ఒకటవ సచివాలయంలో రైతులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని దేశ ప్రధాని నరేంద్రమోదీ ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన ద్వారా 2వ విడత నిధులు విడుదల చేశారన్నారు. దీని వల్ల దేశవ్యాప్తంగా 11 కోట్లు పైగా రైతులకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. రైతుల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తువులనే వాడి మన దేశ ఆర్థిక ప్రగతిని పెంపొందించాలని అన్నారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా మన దేశ శక్తి సామర్థ్యాలను చూపించడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ రెడ్డి వాణి, శివరంజని హార్టికల్చర్ అసిస్టెంట్, అసిస్టెంట్ మహేష్ నాయక్ రైతులు పాల్గొన్నారు.

## రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు విడుదల

**నిమ్మనపల్లె, నవంబర్ 19 ప్రభాతవార్త :**



నిమ్మనపల్లె మండలానికి చెందిన పది గ్రామ పంచాయితీల్లో 153గ్రామాల్లో గల రైతులకు ప్రభుత్వం 5479మంది రైతులకు రూ.54.83లక్షలు రెండవ విడత అన్నదాత సుఖీభవ నిధులు విడుదల అయినట్లు వ్యవసాయ అధికారిణి మంజుల బుధవారం తెలిపారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.2వేలుగా వేసినట్లు తెలిపారు.

## ప్రతి మనిషి ఆరోగ్యంతో ఉండాలి

**ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 19 ప్రభాత వార్త**



కడప జిల్లా ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీలోని శ్రీ సరస్వతి విద్యామందిరంలో బుధవారం ధన్వంతరి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య వ్యక్తగా హాజరైన ఆరోగ్య భారతి క్షేత్ర కార్యదర్శి అయిన కుమారస్వామి మాట్లాడుతూ ప్రతి మనిషి మానసిక ఆరోగ్యం, శారీరక ఆరోగ్యం మరియు ధార్మిక ఆరోగ్యంతో ఉండడానికి చేయవలసిన సరైన ఆరోగ్య, వ్యాయమ అలవాట్ల గురించి చెప్పారు. అలాగే డాక్టర్ ఎన్టిఆర్ వైద్య విశ్వ విద్యాలయం పాలక మండలి సభ్యులు మరియు ఆరోగ్య భారతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమతుల్య ఆహారం తీసుకొని వ్యాయామం,ధ్యానం యొక్క అవశ్యకత వివరిస్తూ ఈ సూచనలు పాటిస్తే ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉంటే ప్రతి కుటుంబం ఆరోగ్యంగా అలాగే ప్రతి ఊరూ , అలా దేశమంతా ఆరోగ్యంగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రామచంద్రయ్య, ఇతర పుర ప్రముఖులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవలో 7071మందికి లబ్ధి

**దువ్వూరు, నవంబర్ 19, ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రవేశపెట్టిన అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకం కింద మండలంలో 7071మంది రైతులకు లబ్ధి చేకూరిందని మండల వ్యవసాయ అధికారి అమర్ నాథ్ రెడ్డి తెలిపారు. బుధవారం ప్రధానమంత్రి తమిళనాడులో పీఎం కిసాన్ నిధులు విడుదల చేయగా, అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించిన నిధులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెండ్లిమర్రి మండలంలో విడుదల చేశారన్నారు. అందుకు సంబంధించి రైతులకు అన్ని రైతు సేవ కేంద్రాల్లో సమావేశాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో 7071 మందికి గాను 4 కోట్ల 86 లక్షల రూపాయలు నిధులు విడుదల చేస్తున్నారని రైతులందరికీ రెండు రోజుల్లో వారి వారి పడిపోతాయని తెలిపారు.

# మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

### విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవు : టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్ మోహన్ రాజు

**రాజంపేట, నవంబర్ 19 ప్రభాతవార్త**

మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని రాజంపేట టిడిపి అసెంబ్లీ ఇంచార్జ్ జగన్మోహన్రాజు ఆదేశించారు. బుధవారం మున్సిపాలిటీ కార్యాలయంలో అధికారులతో సమావేశం అయ్యారు. రాజంపేట మున్సిపాలిటీ పరిధిలో ప్రజా సమస్యలపై,మున్సిపల్ అధికారులు పారదర్శకంగా వ్యవహరించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని,డ్రైనేజీ, పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి సారించాలని,అలాగే కూరగాయల మార్కెట్ సుందరీకరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆయన తెలియజేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే ఎటువంటి కార్యక్రమాలను ఉపేక్షించే ప్రసక్తే లేదని,నిబంధనల మేర ప్రతి ఒక్కరు వ్యవహరించాలని సూచించారు.ట్రాఫిక్ నియంత్రణ,వ్యాపారస్తులు కూడా ప్రజలకు అసౌకర్యం కలగకుండా వ్యవహరించాలని కోరారు.ప్రజా ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా మున్సిపల్ అధికారులు వ్యవహరించాలని ఆయన ఆదేశించారు. మున్సిపల్ అధికారులు విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని చమర్తి హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాసులు, టిడిపి పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి. డాక్టర్ సి.సుధాకర్, కౌన్సిలర్లు తుపాకుల అశోక్, పసుపులేటి సుధాకర్,రాజేష్,గుణకల చిన్న, క్లస్టర్ ఇంచార్జ్ కొల్లి రెడ్డయ్య, మాజీ కౌన్సిలర్ మనుబోలు వెంకటేశ్వర్లు,చిన్నయ్య,మాజీ పట్టణ అధ్యక్షులు సంజీవరావు,పట్టణ ప్రధాన కార్యదర్శి అడపాల శ్రీనివాసులు,ఎస్కె కరీమ్, క్లస్టర్ ఇంచార్జ్ లింగాల శ్రీనివాసులు,తెలుగు యువత పట్టణ అధ్యక్షులు నాగల రమేష్,రామ్ నగర్ నరసింహ,మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మొదటిసారి మున్సిపల్ మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన చమర్తికి మున్సిపల్ అధికారులు,కౌన్సిలర్లు స్వాగతం పలికారు.



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న జగన్ మోహన్ రాజు

## పిజిఆర్ఎస్ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డిఓ మధుసూధన రావు

**లక్కిరెడ్డిపల్లి; నవంబర్ 19, ప్రభాతవార్త**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందే అర్జీలను త్వరగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదనరావు అధికారులను ఆదేశించారు. బుధవారం లక్కిరెడ్డిపల్లి తాసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో పలు రికార్డులను తనిఖీ చేసి గ్రామ రెవెన్యూ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్లో మరియు సీఎంఓ, ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సమస్యలను స్వయంగా ఆలకించి పరిష్కరించాలన్నారు అర్జీదారులతో స్వయంగా మాట్లాడి సమస్యకు సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు. నిబంధనలకు లోబడి సమస్యలను పరిష్కరించే అవకాశం వున్న అర్జీలను వెంటనే క్లియర్ చేయలన్నారు. ఒకవేళ పరిష్కారం చేయడానికి వీలుకాకపోతే అందుకుగల కారణాలను వివరించాలన్నారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ రెడ్డన్న ఎమ్మార్ఐ రాజేష్ విఆర్ఓ వెంకోజి వెంకటరమణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి యూత్ ఫెస్టివల్లో...



**మదనపల్లి క్రైమ్ నవంబర్ 19 ప్రభాతవార్త.**

రాయచోటిలో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి యూత్ ఫెస్టివల్ పోటీల్లో మదనపల్లి శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని కరస్పాండెంట్ రాటకొండ గురు ప్రసాద్ తెలిపారు. ఫెస్టివల్ లో ప్రతిభ చాటన విద్యార్థులను బుధవారం కరస్పాండెంట్ అభినందించారు. సందర్భంగా గురు ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా స్థాయి యూత్ ఫెస్టివల్ పోటీల్లో జరిగిన లంబాడ డాన్స్ లో ప్రథమ స్థానం, జానపద గీతం (గ్రూప్ సాంగ్ ) లో ప్రథమ స్థానం, జానపద నృత్యంలో ద్వితీయ స్థానంలో తమ కళాశాల విద్యార్థులే దక్కించుకున్నారన్నారు. మొదటి స్థానాన్ని గెలుపొందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విజయవాడ లో జరుగు యూత్ ఫెస్టివల్ లో వీరు పాల్గొంటారన్నారు. యూత్ ఫెస్టివల్ లో గెలుపొందిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ రమాదేవి డాన్స్ మాస్టర్ సురేష్, కీ బోర్డ్ ప్లేయర్ మురళి, హరి లు అభినందించారు.

## పాఠశాలలో విద్యార్థినిల ముగ్గుల పోటీలు.



**తంబళ్లపల్లె నవంబర్ 19 ప్రభాతవార్త ః**

మండల కేంద్రంలోని శ్రీ సాయి విద్యా మందిర్ లో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా బుధవారం విద్యార్థినులకు ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలు వేసిన రకరకాల ముగ్గులను గ్రంథాలయ అధికారి జిలానీ భాష, పాఠశాల హెడ్మాస్టర్ సాజిదా పరిశీలించి విద్యార్థినుల నైపుణ్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బాలికలు విద్యుత్ తో పాటు క్రీడలు, సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రాధాన్యత నివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి గ్రామోత్సవం



**నందలూరు, నవంబర్19 ప్రభాతవార్త**

మండలంలోని నాగిరెడ్డి పల్లెలో శ్రీ అయ్యప్ప స్వామి వారి గ్రామోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. బుధవారం శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణ కమిటీ గణపతి హోమం అయ్యప్ప మూలమంత్ర భవనం అనంతరం అయ్యప్పస్వామి వారికి అష్టాభిషేకం నిర్వహించారు. సాయంత్రం అత్యంత ఘనంగా శ్రీ గణపతి, శ్రీ సుబ్రహ్మణ్యస్వామి సహిత శ్రీ అయ్యప్ప స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ గ్రామోత్సవం లో పెద్ద ఎత్తున మహిళలు, అయ్యప్ప దీక్షా పరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బాలు గురుస్వామి, తోట శివశంకర్ గురుస్వామి, సుధాకర్ గురుస్వామి, మురళి గురుస్వామి, కుమార్ గురుస్వామి, యల్లయ్య గురుస్వామి, రమేష్ గురుస్వామి, జనార్దన్ రెడ్డి, జయకుమార్ రెడ్డి, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి బేస్ బాల్ క్రీడల్లో విద్యార్థులు

**లక్కిరెడ్డిపల్లి ; నవంబరు 19, ప్రభాత వార్త**



లక్కిరెడ్డిపల్లి ఏపీ మోడల్ స్కూల్ కు చెందిన ఓం ప్రసన్న అరవిందులు రాష్ట్రస్థాయిలో బేస్ బాల్ ప్రథమ స్థానం దక్కించుకున్నారని ప్రిన్సిపల్ వరాల రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ఎంపికై ఈనెల 15 ,16, 17 తేదీలలో రాష్ట్రస్థాయి రైల్వే కోడూరు లో జరిగిన బేస్ బాల్ లో ఓం ప్రసన్న అరవిందు ఇంటర్మీడియట్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు అలాగే డి చందన కబడ్డీలో రాష్ట్రస్థాయిలో అండర్ 19 లో ఎంపికయ్యారు వీరికి ప్రశంసా పత్రాలు కప్ అందజేశారు ఈ కప్పును బుధవారం మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రమేష్ పిడి సోమశేఖర్ నాయక్ విద్యార్థులను అభినందించారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



**బద్వేలు, నవంబర్ 19 (ప్రభాతవార్త):**

అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు సీడీపీవో శ్రీదేవి తెలిపారు. రాచాయపేట, కాలువపల్లి, పెద్ద గోపవరం, పీపీకుంట, బ్రాహ్మణపల్లె పాఠశాలల్లో ఈ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. బాల్యవివాహాలు, హెల్ప్లైన్ నెంబర్లు, గుడ్టచ్ అండ్ బ్యాడ్ టచ్, ఆరోగ్యం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రాచాయపేట ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు మాట్లాడుతూ ఆడపిల్లలు బాగా చదువుకుంటే అన్ని రంగాలలో రాణిస్తారని అటు కుటుంబం మరియు సమాజంలో మంచి పేరు ఉందన్నారు. ఆడపిల్లకు ప్రధానంగా చదువుకుంటే ధైర్యం కలిగి ఉండి సమస్యలను ఎదుర్కోవాలన్నారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ లక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఆడపిల్ల విద్యతో పాటు విజ్ఞానం కూడా ఎంతో అవసరమని సమాజంలో జరుగుతున్న ప్రతి అంశాన్ని ముందుకు ధైర్యంగా వెళ్లాలన్నారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం నుంచి యూనస్ బాష హాజరై బాలల హక్కుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సత్యవతి, రఫివున్నిసా, భారతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

**మదనపల్లె, నవంబర్ 19 ప్రభాతవార్త :**

రైతు సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే షాజహాన్బాషా తెలిపారు. బుధవారం పట్టణంలోని సిఎస్ఐ జేసీఎం కమ్యూనిటి హాలులో అన్నదాత సుఖీభవ పథకం రెండవ విడత నిధుల విడుదల సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే షాజహాన్బాషా మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 46,86లక్షల మంది లబ్దిదారులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులు ఖాతాల్లో ముఖ్యమంత్రి రూ.7వేలు జమ చేయడం జరిగిందన్నారు. రైతులను రారాజులుగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పెద్దపీట వేయడం జరిగిందన్నారు. గత ఐదేళ్ళ వైకాపా పాలనలో జగన్మోహన్రెడ్డి రైతులను పట్టించుకోలేదని విమర్శించారు. త్వరలోనే రైతుల కోసం పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేయనున్నట్లు తెలిపారు. రాయలసీమ ప్రాంతంలో హంద్రీ–నీవా కాలువ ద్వారా రైతులకు తాగు,సాగునీరు అందించి కరువు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే హంద్రీ–నీవా కాలువ ద్వారా క్రిష్ణాజలాలను చెరువులకు నింపే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం కార్యక్రమాన్ని టిడిపి నాయకులు ఓ పండుగలా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్యార్డు ఛైర్మెన్ జంగాల శివరామ్, డైరెక్టర్ పచ్చిపాల రామక్రిష్ణ, ఆర్జె.వెంకటేష్, టిడిపి రాష్ట్ర మైనార్టీ నాయకులు ఎస్ ఎ.మస్తాన్, డైరెక్టర్లు చల్లా నరసింహులు, వెంకటేశ్వరస్వామి ఆలయ ఛైర్మెన్, నవీన్చౌదరి, టిడిపి నాయకులు నందకుమార్, రాటకొండ మధుబాబు, వ్యవసాయ అధికారి నవీన్కుమార్రెడ్డి,రైతులు, మహిళలు పాల్గొన్నారు.



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

## ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజా దర్బార్

**రాయచోటి నవంబర్ 19 ప్రభాతవార్త**

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి బుధవారం పట్టణంలోనే క్యాంపు కార్యాలయంలో ఉండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా వేదిక నిర్వహించారు. ప్రజల నుండి వచ్చిన వెనతులు సమస్యలను స్వయంగా విని ఆయా అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు రాష్ట్ర మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని అన్నారు అధికారులు కూడా ప్రజల సమస్యలతో వచ్చిన వారికి తక్షణమే వారి సమస్యలను పరిష్కరించి వారికి తగు అన్నారు న్యాయం చేయాలని అన్నారు అనంతరం రాష్ట్ర మంత్రిని పలువురు నాయకులు అధికారులు పుష్పగుచ్చాల దృశ్యాలతో ఆయన ఘనంగా సన్మానించారు.



## ఆడపిల్లల దేశానికి వెన్నుముక : హైమావతి



**రాయచోటి నవంబర్ 19 ప్రభాతవార్త**

జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ సాధికారిక అధికారి వారి ఆధ్వర్యంలో బుధవార పట్టణంలో నీ సుండుపల్లె రోడ్డులో గల నారాయణ ఫంక్షన్ హాల్ నందు బేటి బచావో బేటి పడావో పథకం గ్రామాలు మహిళా సంరక్షణ కార్యదర్శులకు జిల్లా స్థాయి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ సాధికారిక అధికారి కే హైమావతి మాట్లాడుతూ భేటీ బచావో బేటి పడావో అని పదము ఒక హిందీ పదము అని అది కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది అని అన్నారు భేటీ బచావో బేటి బేటి పడావో పథకం ఏప్రి ల్ నుండి మార్చ్ షెడ్యూల్ పంపడం దీనిని గ్రామా, మండల , జిల్లా స్థాయిలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలియజేసారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు అనేది మన దేశంలో జరపడం గమనార్హం అని తెలిపారు బాలికలు నిష్పత్తి జిల్లాలో తక్కువగా ఉన్నారంటే ఆడపిల్లలు మీద ఉన్న అపోహలన్నీ అవగాహన కార్యక్రమాల ద్వారా తొలగించే ప్రయత్నం చేయాలి అని అన్నారు. బాల్యవివాహాలు ఎలా అరికట్టాలి, ఫోక్సో గురించి క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో ట్రెజరీ ఏటిఓ జయలక్ష్మి, జిఎస్డబ్ల్యూఎస్ డిపార్ట్మెంట్ డిడిఓ లక్ష్మీపతి సిడిపిఓ శశికళ, జిల్లా బాలల పరిరక్షణ అధికారి బి .వినోద్ కుమార్, సిడిపిఓలు, సూపర్వైజర్లు మహిళా కార్యదర్శి జిల్లా బాలల పరిరక్షణ సిబ్బంది శిశు గృహ సిబ్బంది మరియు వన్ స్టాప్ సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమంలో అధికారులు

**కేవీ పల్లె,నవంబర్ 19 ప్రభాతవార్త:**

ఈ నెల 14 నుంచి నిర్వహించిన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ కవి వేంపల్లె అబ్దుల్ ఖాదర్ మాట్లాడుతూ వ్యక్తిత్వాన్ని, సంస్కారాన్ని, ప్రతిభను వెలికి తీసేది గ్రంథాలయం ఒక్కటేనన్నారు. నాశనం లేనిది అక్షరమని, అక్షర సముదాయమే పుస్తకమని, పుస్తక సముదాయమే గ్రంథాలయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో లోకేశ్వరరెడ్డి. రిటైర్డ్ హెచ్ఎం శ్రీరాములురాజు, హెచ్ఎం జయపాలరెడ్డి, నరసింహులు, మురళీధర్ రాజు గ్రంథాలయాధికారి అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయం : మంత్రి

### నేడు రైతుల ఖాతాల్లోకి రూ.30కోట్లు పంపిణీ



మెగా చెక్కును పంపిణీ చేస్తున్న దృశ్యం

**కురబలకోట, నవంబర్ 19 ప్రభాతవార్త :**

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని జిల్లా ఇన్చార్జ్, రాష్ట్ర మంత్రి బిసి జనార్ధన్రెడ్డి అన్నారు. బుధవారం కురబలకోట మండలం అంగళ్ళులోని భారత్ కళ్యాణ మండపంలో అన్నదాత సుఖీభవ రెండవ విడత నిధులు విడుదల కార్యక్రమంలో జేసి ఆదర్శ రాజేంద్రన్తో కలిసి రైతుల ఖాతాల్లోకి నిధుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు బాగుంటే రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉంటుందని నమ్మేది తమ ప్రభుత్వమన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా కట్టుబడి సూపర్సిక్స్ను సూపర్ సక్సస్ చేశామన్నారు. రాష్ట్రం ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికి అన్నదాత సుఖీభవ బాగంలో రెండవ విడతలో ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లోకి రూ.14వేలు జమ చేశామన్నారు. పెన్షన్లు రూ.4వేలు పెంపు, మహిళలు ఉచిత గ్యాస్ పంపిణీ, మహిళలకు ఉచిత ప్రయాణం, తల్లికి వందనం తదితర పథకాలను విజయవంతంగా అమలు చేసిన ఘనత తన ప్రభుత్వందే అన్నారు. గత పాలకులు అరాచకపాలన సాగిస్తే నేడు చంద్రబాబునాయుడు రైతు పక్షపాతిగా నిలిచి సంక్షేమానికి కట్టుబడి పాలన సాగిస్తున్నారని తెలిపారు. విశాఖ సిఐఐ సదస్సు ద్వారా రాష్ట్రానికి రూ.13లక్షల కోట్లకు పైగా పెట్టు బడులు వచ్చాయని, నిరుద్యోగ యువతకు 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. రాష్ట్రంలో గుంతల రహదారుల అభివృద్ధికి రూ.1080కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. అన్నమయ్య జిల్లాలో 188408మంది రైతుల ఖాతాల్లోకి రూ.126కోట్లు జమ చేశామన్నారు. ఇందులో తంబళ్ళపల్లె నియోజకవర్గానికి రూ.30కోట్లు మేరా రైతుల ఖాతాల్లోకి జమ చేయడం జరిగిందన్నారు. జేసి ఆదర్శ రాజేంద్రన్ మాట్లాడుతూ రైతులు ఈ నిధులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్రికల్చర్ అధికారి శివనారాయణ, పీడి లక్ష్మీప్రసన్న, డిహెచ్ఓ సుభాషిణి, ఎంపిడిఓ గంగయ్య, తహశీల్దార్ తేజశ్వని,ఏఓ వినూత, టిడిపి నాయకులు షేక్ పర్వీన్తాజ్, నియోజకవర్గ పరిశీలకులు దినేష్రెడ్డి, గుత్తికొండ త్యాగరాజు, సురేంద్రయాదవ్, వైజి.రమణ, వైజి.సరేంద్ర, తిమ్మరాయుడు, డిఆర్. వెంకటరమణారెడ్డి, మండల యువత అధ్యక్షులు శెట్టి సీతారామ్బాబు, విండో అధ్యక్షులు జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా పుట్బాల్ పోటీలు ప్రారంభం

**మదనపల్లె, నవంబర్ 19 ప్రభాతవార్త :**

మదనపలెల రూరల్ మండలం గ్రీన్వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ నందు 69వ రాష్ట్రస్థాయి అండర్–14 బాలిబాలికల పుట్బాల్ పోటీలను మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి, శారీరక ధృడత్వానికి క్రీడలు దోహదపడుతాయన్నారు. ప్రతిభ కనపరచి మంచి క్రీడాకారులుగా గుర్తింపు తెచ్చుకోవాలని తెలిపారు. ఉమ్మడి చిత్తూరుజిల్లా స్కూల్గేమ్స్లో చంద్రమాకులపల్లె జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఈ క్రీడల్లో 450మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరచి వారిని రాష్ట్ర జటుటకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రమాకులపల్లె హెచ్ఎం గ్రీన్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ రంగారెడ్డి, రాష్ట్రం నలుమూలల నుంచి వ్యాయామ ఉపాధ్యాయులు కోచులు మేనేజర్లు పాల్గొన్నారు.



క్రీడా జ్యోతిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

## శ్రీ వీరభద్రుని ఆలయంలో అమావాస్య పూజలు



**చిట్వేలి, నవంబర్ 19, ప్రభాతవార్త:**

స్థానిక పాత చిట్వేలి గ్రామంలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో మూడవ అమావాస్య పూజలను బుధవారం ఆలయ పెద్దలు పెద్ద ఎత్తున నిర్వహించారు. స్వామి అమ్మవారికి విశేష పూజలు, ప్రత్యేక అలంకారాలను అర్చకులు మృత్యుంజయ నిర్వహించారు. సాయంత్రం గణపతి నవగ్రహాలు, స్వామి అమ్మవారికి విశేష హోమాలు చేపట్టారు.తదుపరి కళాశాభిషేకం చేసి, స్వామి అమ్మవారి ప్రత్యేక ప్రతిమలను అలంకరించి,భక్తులకు దర్శనాన్ని కలిగించారు. బెంగళూరుకు చెందిన పలువురు భక్తులతో పాటు,మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున భక్తులు ఈ విశేష పూజల్లో పాల్గొని స్వామి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పెద్దలు అల్పాహార విందుతో పాటు భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు.

## గ్రంథాలయంలో ఇందిరా గాంధీ జయంతి వేడుకలు



**ఖాజీపేట, నవంబర్ 19, ప్రభాతవార్త:**

ఖాజీపేట శాఖా గ్రంథాలయం నందు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో 6వ రోజు అయిన బుధవారం స్వర్గీయ శ్రీమతి ఇందిరాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఇందిరమ్మ చిత్రపటంనకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఇందిరాగాంధీ 1917న ఉత్తరప్రదేశ్ లోని అలహాబాద్ లో జన్మించారు. ఇందిరాగాంధీ 1966లో భారత దేశము మొదటి మరియు మహిళా ఏకైక ప్రధానమంత్రి ఇందిరాగాంధీ, భారత దేశము మొదటి ప్రధాని కుమార్తె ఆమె తండ్రి జవహర్ లాల్ నెహ్రూ, తల్లి శ్రీమతి కమలా నెహ్రూ సిక్కు వ్యతిరేక ఉద్యమాల కారణంగా ఇందిరాగాంధీ ని 31:10: 1984వ తేదిన చంపబడ్డారు అని గ్రంథాలయాధికారి కే.హరికృష్ణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యా యులు డి.ఎల్ సుబ్బారెడ్డి మరియు మహిళ ఉపాధ్యాయులు భవాని, ఎం.వీర సులోచన, ఎం ఎం నిర్మల, బీడీసీ నిర్వాహకులు పి.వెంకట రవి, వి.శివశంకర్ పాల్గొన్నారు.

### జోగులాంభ శక్తిపీఠం నుంచి

# ప్రారంభమైన మహాపాదయాత్ర



**పులివెందుల నవంబర్ 19, ప్రభాత వార్త :**

తెలంగాణ రాష్ట్రంలోని గద్వాల జిల్లా జోగులాంభ శక్తిపీఠం నుంచి అంబకపల్లె అవులస్వామీ బృంధం శబరిమల మహాపాదయాత్ర ప్రారంభమైంది. బుధవారం జోగులాంభ శక్తిపీఠం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడి కట్టుకున అనంతరం ఈ మహాపాదయాత్ర ప్రారంభమ య్యింది. లింగాల మండలం అంబకపల్లెకు చెందిన వైసీపీ నాయకులు బండి శ్రీనివాసులరెడ్డి అధ్వర్యంలో ఈ మహా పాదయాత్ర ప్రారంభమైంది. ఈ పాదయాత్ర 9 రోజుల పాటు సాగిన అనంతరం 29వ తారీకు అంబక పల్లె గ్రామానికి చేరుకోనున్న బృందం చేరుకోనుంది. నవంబర్ 30వ తేదికి పులివెందులలోని రంగాపురం అయ్యప్ప స్వామి గుడి వద్దకు చేరుకోనుంది. ఇక్కడి నుంచి 1వ తేది స్థానిక శివాలయంలో మండల పూజ కార్యక్రమంలో పాల్గొని అనంతరం పులివెందుల నుంచి తిరిగి మహపాద యాత్రను ప్రారంభించ నున్నారు. ఈ మహపాదయాత్ర కదిరి, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల మీదుగా 24 రోజుల అనంతరం మహపాదయాత్ర శబరిమల చేరుకోనుంది. 34 రోజుల పాటు భక్తు గీతా లపనలతో సాగనున్న మహపాదయాత్ర సాగనుంది. ఇరుముడి ధరించి మహపాదయాత్ర ప్రారంభి స్తున్న సందర్భంగా గద్వాల జిల్లా జోగులాంబ ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో వైసీపీ నేతలు వైఎస్ భాస్కర్ రెడ్డి, దేవిరెడ్డి శంకర్ రెడ్డిలు పాల్గొని అశీర్వాదాలు తీసుకున్నారు. మహా పాదయాత్ర సందర్భంగా 35 రోజులపాటు అయ్యప్ప మాల ధరించి ఇరుముడితో పాదయాత్రగా శబరిమలై వెళుతున్న స్వాములు అందరికీ మంచి ఆయురారోగ్యాలతో పాదయాత్ర సజావుగా జరిగేలా దేవుడు ఆశీర్వదించాలని ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి, దేవిరెడ్డి శంకర్రెడ్డిలు ఆకాంక్షించారు.

## దాతల సహకారంతో నీటి తొట్టి ఏర్పాటు



**సుండుపల్లె,నవంబర్ 19, ప్రభాతవార్త :**

మండల కేంద్రమైన శివాలయంలో దాతల సహకారంతో భక్తుల కోసం నీటి వసతి ఏర్పాటైంది. సుండుపల్లెలో శ్రీ సప్తగిరి షామియానా డెకరేషన్స్ నిర్వహిస్తున్న ప్రకాష్ బండకాడ ఈడిగపల్లెకు చెందిన ఈశ్వరయ్య దాతృత్వంతో ఆలయంలో నీటి నిల్వ కోసం ప్రత్యేకంగా నీటి తొట్టి నిర్మించారు. అదనంగా, భక్తులకు నిరంతర నీటి సరఫరా అందించేందుకు కొత్త పైప్లైన్ను కూడా ఏర్పాటు చేశారు.ఈ సదుపాయంతో ప్రస్తుతం మాలధారణ చేసిన భక్తులు అక్కడే స్నానాలు ఆచరించి ఆల్నయలో పూజల్లో పాల్గొంటున్నారు. ఉదయం–సాయంత్రం ఆలయానికి విచ్చేసే భక్తులు నీటి తొట్టివద్ద నీటితో చేతులు, కాళ్లు శుభ్రం చేసుకుని ఆలయంలోకి ప్రవేశిస్తున్నారు.

## జగన్ను కలిసిన మున్సిపాలిటి వైసీపీ ఉపాధ్యక్షుడు

**బద్వేల్ అర్బన్, నవంబర్ 19, ప్రభాతవార్త**



మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని బుధవారం బద్వేల్ మున్సిపాలిటీ వైసిపి ఉపాధ్యక్షుడు తుమ్మిశెట్టి సునీల్ కలిశారు. నియోజవర్గంలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అలాగే వైద్య విద్యను ప్రైవేటుపరం చేయడానికి నిరసిస్తూ బద్వేల్ వ్యాప్తంగా చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమం ముమ్మరంగా జరుగుతుందన్నారు. అలాగే నియోజకవర్గ వ్యాప్తంగా వైసిపిని మరింత పటిష్టపరిచేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. జగన్ను కలిసిన వారిలో కడప ఎంపీ అవినాష్ రెడ్డి తదితరులు ఉన్నారు.